

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 22-03-2025 | సంపుటి - 22 | సంచిక - 328 | రూ : 4 | పేజీలు: 8


## తక్కువ వడ్డీకి రుణాలివ్వండి



- నాబార్డు ఛైర్మన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

హైదరాబాద్: తెలంగాణకు గ్రామీణ మౌలిక వసతుల నిధి (ఆర్ఐడీఎఫ్) కింద తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని నాబార్డు (జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు) ఛైర్మన్ కేవీ షాజీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. శాసనసభ ప్రాంగణంలోని కార్యాలయంలో శుక్రవారం సీఎంను షాజీ కలిశారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో సీఎం మాట్లాడుతూ... ''తెలంగాణలో సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి. ఈ మేరకు కొత్తగా మరిన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి. కొత్త గ్రామ పంచాయతీల మధ్య అనుసంధానం పెంచేందుకు చర్యలు చేపట్టాలి. స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలి. ఇందిరా క్రాంతిపథం,

తరువాయి 2లో



## 'పది' పరీక్షల తొలిరోజే కలకలం

- మంచిర్యాలలో ప్రశ్నపత్రం తారుమారు
- నకిరేకల్‌లో బయటకొచ్చిన ప్రశ్నపత్రం
- ఈ ఘటనలపై విద్యాశాఖ సీరియస్.. బాధ్యులపై చర్యలు
- మొదటి రోజు 99.67 శాతం హాజరు

హైదరాబాద్, నల్గొండ: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే రెండు ఘటనలు విద్యాశాఖలో కలకలం సృష్టించాయి. మంచిర్యాల పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రానికి తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రాన్ని తీసుకురావడం నల్గొండ జిల్లా నకిరేకల్‌లో పరీక్ష పూర్తికాకముందే ప్రశ్నపత్రం సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడాన్ని సీరియస్‌గా పరిగణించిన విద్యాశాఖ విచారణకు ఆదేశించింది. మంచిర్యాల

తరువాయి 2లో

# వడగళ్లు తెచ్చిన నష్టం

- రాష్ట్రంలో పలుచోట్ల అకాల వర్షా లు
- వరి, మొక్కజొన్న, మామిడి రైతులకు నష్టం
- కుమురం భీం జిల్లాలో గోడ కూలి ఒకరి మృతి

హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో వడగళ్లు కురిసి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. అత్యధికంగా నిర్మల్ జిల్లా ముథోల్‌లో 2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. వడగళ్ల వానతో పొట్ట దశలోని ధాన్యపు గింజలు, మామిడి పూత, కాయలు రాలిపోయాయి. మొక్కజొన్న పంట నేలవాలింది. ఇన్నాళ్లూ కంటిరెప్పలా

తరువాయి 2లో



## ఏడుకొండల పరిధిలో వాణిజ్య కార్యకలాపాలకు వీల్లేదు

- అందుకే ముంతాజ్ హోటల్‌కు భూకేటాయింపులు, అనుమతుల రద్దు
- మానవ సేవకు అన్నదానం, ప్రాణదానం.. మాధవ సేవకు ఆలయాల నిర్మాణం
- ఆలయాల పవిత్రతకు అధిక ప్రాధాన్యం
- తిరుమలలో సీఎం చంద్రబాబు

తిరుపతి: 'మానవ సేవలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తిరుమలలో అన్నదానం ప్రారంభిస్తే, తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో నేను ప్రాణదాన కార్యక్రమం ప్రవేశపెట్టాను. మాధవ సేవకుగానూ ఇప్పుడు ఆలయాల నిర్మాణానికి సంకల్పం తీసుకున్నామ'ని ముఖ్యమంత్రి చంద్రబాబు



వెల్లడించారు. గ్రామాల్లో గుడులు నిర్మించాలని అనేక వినతులు వస్తున్నాయని, ఇందుకోసం 'వేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణనిధి' పేరుతో ట్రస్టు ఏర్పాటు చేస్తామన్నారు. ఇంకా ఏదైనా మంచి పేరుంటే పెట్టాలని

తరువాయి 2లో



## ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నాం

* హామీలను పక్కాగా అమలు చేస్తున్నాం
* పదేళ్లలో భారాస ప్రభుత్వ ఖర్చు రూ.16.70 లక్షల కోట్లు
* అంత సొమ్ము వెచ్చించి నాగార్జునసాగర్, ఓఆర్ఆర్, విమానాశ్రయం వంటివి నిర్మించారా?

2లో

## బలభద్రపురాన్ని వణికిస్తున్న క్యాన్సర్

* గడిచిన రెండేళ్లలో వేగంగా విజృంభణ
* చాలా కుటుంబాల్లో రోగులు.. మృతులూ ఎక్కువే
* జల, వాయు కాలుష్యమే కారణమంటున్న స్థానికులు

2లో





## గాజాను ఆక్రమించమని సైన్యాన్ని ఆదేశించా

- ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్

టెల్ అవీవ్: గాజా విషయంలో ఇజ్రాయెల్ మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. బందీలను విడిచిపెట్టకపోతే గాజాలోని భూభాగాలను క్రమక్రమంగా ఆక్రమిస్తామని హెచ్చరికలు పంపింది. హమాస్ తలొగ్గితేనే తమ ఆక్రమణ ఆగుతుందని.. అప్పటివరకు సైన్యం మరిన్ని భూభాగాలను ఇజ్రాయెల్‌లో విలీనం చేస్తూనే ఉంటుందని శుక్రవారం ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ తెలిపారు. ''బందీలను హమాస్ విడిచిపెట్టకపోతే

తరువాయి 2లో



## లోకో పైలట్లు కూల్‌డ్రింక్స్ తాగవచ్చా?.. రైల్వేశాఖ ఏమన్నదంటే!

* ఒడెసా నగరంలో భారీగా మంటలు

కీవ్: ఉక్రెయిన్‌లోని నల్లసముద్రం తీరంలోని ఒడెసా నగరంపై రష్యా భారీస్థాయిలో డ్రోన్లతో విరుచుకుపడింది. ముగ్గురు పౌరులకు గాయాలయ్యాయి. నగరంలో చాలా చోట్ల మంటలు చెలరేగాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కూడా నిలిచిపోయిందని స్థానిక అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌లోని ఇంధన కేంద్రాలపై దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తామని ఇటీవల ట్రంప్‌తో జరిగిన చర్చల్లో

తరువాయి 2లో

## నూతన కోర్టు భవనాల నిర్మాణాలకు రూ.1000 కోట్లు

* అడ్వొకేట్లు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్‌కార్డులు
* మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 13 జిల్లాల్లో నూతన కోర్టు భవనాల నిర్మాణాలకు రూ.1000 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. 'అడ్వొకేట్‌లు, గుమాస్తాల సంక్షేమ చట్టం సవరణ బిల్లు 2025'ను శుక్రవారం మండలిలో ప్రవేశపెట్టిన సందర్భంగా సభ్యులు ప్రస్తావించిన అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు. నూతన హైకోర్టు భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి 100 ఎకరాలను కేటాయించారన్నారు. ''నూతన హైకోర్టు, న్యాయమూర్తుల నివాస సముదాయాల నిర్మాణానికి రూ.2600 కోట్లు వెచ్చిస్తున్నాం. రాష్ట్రంలోని అడ్వొకేట్లు, వారి కుటుంబసభ్యులతో కలిపి మొత్తం

తరువాయి 2లో



# ఏడుకొండల పరిధిలో వాణిజ్య కార్యకలాపాలకు వీల్లేదు

(మొదటిపేజీ తరువాయి)

తితిదే అధికారులకు సూచించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో పాటు భక్తులిచ్చే విరాళాలతో పకడ్బం దీగా ఆలయాల నిర్మాణం చేపడతామని సీఎం స్పష్టంచేశారు. వాటి నిర్వ హణ బాధ్యతలు స్థానికులకే అప్పగిస్తామన్నారు. మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం తిరుమల శ్రీవారిని దర్శిం చుకున్న అనంతరం శ్రీపద్మావతి అతిథిగృహంలో సీఎం చంద్రబాబు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఏఈవో వెంకయ్యచౌదరి, పాలక మండలి సభ్యులు, అధికారులతో సమీక్షించారు. అక్కడే విలేకరుల సమావేశంలో కీలక నిర్ణయాలు వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

## అపవిత్రం చేయొద్దు

ఏడుకొండలు వేంకటేశ్వరస్వామి సొంతం. వీటిని ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఒబెరాయ్ గ్రూప్‌నకు చెందిన ముంతాజ్ హోటల్‌కు 20 ఎకరాలు వైకాపా హయాంలో కేటాయించి, నిర్మాణానికి అనుమతులిచ్చారు. దీన్ని రద్దు చేస్తున్నాం. వైష్ణవి వెర్సటైల్ వెంచర్ (దేవలోక్)కు 10.32 ఎకరాలు, ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన మరో 5 ఎకరాలూ రద్దు చేయాలని నిర్ణయించాం. ఏడుకొండలను ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని అపవిత్రం చేయడానికి, అక్కడ వాణిజ్య కార్యకలాపాలకు వీల్లేదు.



ఒబెరాయ్ హోటల్ యాజమాన్యానికి ఇదే చెప్పా. ప్రత్యామ్నాయంగా మరో చోట భూమి ఇస్తామని మేం చేసిన ప్రతిపాదనకు వారు అంగీకరించారు.

## విదేశాల్లోనూ ఆలయాలు నిర్మిస్తాం

దేశంలో అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు కట్టాలని సంకల్పం తీసుకున్నా. ముఖ్యమంత్రులందరికీ లేఖ రాస్తా. వారు ముందుకొస్తే, అక్కడ గుడులు కట్టే బాధ్యతను తితిదే తీసుకుంటుంది. విదేశాల్లోనూ హిందువులు ఎక్కువ సంఖ్యలో ఉన్నచోట శ్రీవారి ఆలయాలు నిర్మిస్తాం. అమరావతిలో ఇటీవల కల్యాణ మహోత్సవం నిర్వహించాక, ఓ కొత్త శక్తి, శోభ, నమ్మకం వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు వేంకటేశ్వరస్వామి, కూచిపూడి, అరకు కాఫీ వారసత్వ సంపదలు. ఈ మూడింటినీ ప్రోత్సహిస్తున్నాం. దేశంలో, ప్రపంచంలో ఉన్న శ్రీవారి ఆస్తులు కాపాడాలని కంకణం కట్టుకున్నా. హథీరాంజీ మఠమే కాదు, స్వామివారి ఆస్తులు ఏవి కబ్జాచేసినా, మళ్లీ అవి దేవుడికే చెందేలా చర్యలు తీసుకుంటాం. తిరుమలలో హిందువులే పనిచేయాలి. అదేవిధంగా క్రైస్తవ, ముస్లిం ప్రార్థనా మందిరాల్లో హిందువులు పని చేయకూడదని ఉంటే వారి మనోభావాల ప్రకారం నడుచుకుంటాం. అక్కడ హిందువులు విధులు నిర్వర్తించకుండా చూస్తా.

## వ్యక్తిగత ప్రయోజనాలొద్దు

గతంలో అసెంబ్లీలో 'ఏడుకొండలు లేవు. ఐదు కొండలే ఉన్నాయి' అని కొందరన్నారు. దీనిపై అప్పట్లో పోరాడా. మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్రగా వచ్చా. సమాజాన్ని ప్రభావితం చేసే వ్యక్తులు మౌనంగా ఉంటే, చాలా నష్టం జరుగుతుంది. అలిపిరిలో దాడి ఘటన నుంచి స్వామివారే నన్ను కాపాడారు. తితిదే ఉద్యోగులు, ఆలయ నిర్వాహకులు, బోర్డు సభ్యులు.. ఎవరైనా తిరుమల పవిత్రతను కాపాడడానికి వీలైతే ఓ అడుగు ముందుకేయాలి. లేదంటే కనీసం వారి పని వారు చేసినా చాలు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేయకూడదు. అపచారం, అపవిత్రం అసలే చేయొద్దు. గత ఐదేళ్లూ తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఎన్నో పోరాటాలు చేసినా, నాటి పాలకులు పట్టించుకోలేదు. నేను సీఎంగా బాధ్యతలు చేపట్టాక, రాష్ట్రాన్ని పునర్నిర్మించడంలో భాగంగా తిరుమల నుంచే ప్రక్షాళన చేస్తానని చెప్పా. ఈవోగా శ్యామలరావును నియమించా. కొన్ని తప్పిదాలను ఆయన సరిదిద్దారు. ఇంకా చిన్నచిన్న పనులు మిగాలియి. వాటినీ చేస్తాం.

## * ఆలయం మూసేస్తానంటే కోప్పడ్డా

తిరుపతిలో నీటిఎద్దడి తలెత్తితే తెలుగు గంగ నీళ్లు నేనే తీసుకొచ్చా. తిరుమలలో ఓ సీజన్‌లో నీరు లేదు. రోజూ ఐదారు వందల ట్యాంకర్లు తిరుపతి నుంచి కొండపైకి తీసుకురావడం కష్టంగా ఉందని అధికారులు చెప్పారు. మూణ్నెల్ల పాటు ఆలయం మూసేస్తామంటే కోప్పడ్డా. 90 95 రోజుల్లో కల్యాణి డ్యాం నుంచి ఎల్‌అండ్‌టీ సంస్థతో నీటి సరఫరా పనులు పూర్తిచేయించా. ఆలస్యమైతే అరెస్టు చేయిస్తానని హెచ్చరించా. వేంకటేశ్వరస్వామి ఆలయం మూసివేసి ఉంటే చరిత్రలో రాయాల్సి వచ్చేది. ఆలయాల నిర్వహణకు సంబంధించి మన రాష్ట్రంలో మంచివ్యవస్థ ఉంది. స్వయం ప్రతిపత్తి కన్నా గుడుల అభివృద్ధికి చేయాల్సినవన్నీ చేస్తాం. డిప్యూటేషన్‌పై వచ్చి తితిదేలో తిష్ఠవేసిన అధికారులతో పాటు నిర్ణయాల్లో లోపాలుంటే త్వరలో సమీక్షించి సరి చేస్తాం. కొండపై పచ్చదనాన్ని 68% నుంచి 90 శాతానికి తీసుకెళ్లాలని ఆదేశించా. శ్రీవాణి ట్రస్టుకు పన్ను మినహాయింపును కొనసాగిస్తాం. అందులో వచ్చే డబ్బులు దేవాలయాల నిర్మాణానికి వినియోగిస్తాం. గత ఐదేళ్లలో జరిగిన అరాచకాలపై విజిలెన్స్ విచారణ జరిగింది. ఇది ప్రభుత్వ అంతర్గత వ్యవహారం.

# బలభద్రపురాన్ని వణికిస్తున్న క్యాన్సర్

(మొదటిపేజీ తరువాయి)

'నేను మూడేళ్లుగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాను. నా భర్త రాజు నాకు సేవలు చేసేవారు. రెండేళ్ల క్రితం ఆయనకూ క్యాన్సర్ నిర్ధారణైంది. తర్వాత ఆరు నెలల్లోనే చనిపోయారు. ఆయన చికిత్స కోసం దాదాపు రూ.4.5 లక్షలు ఖర్చు పెట్టినా ప్రాణాలు దక్కలేదు. క్యాన్సర్ మహమ్మారి వల్ల మా కుటుంబం దిక్కులేనిదైంది' అని తాతపూడి మునలమ్మ కన్నీరుమున్నీరయ్యారు. ఇది ఆ ఒక్క అభాగ్యురాలి వ్యథ మాత్రమే కాదు. ఆ గ్రామంలో ఏ వీధిలోకి వెళ్లినా ఇలాంటి కన్నీటి కథలే. క్యాన్సర్ భూతం కోరల్లో చిక్కి ఛిద్రమైన కుటుంబాల వేదనే. ప్రకృతి సౌందర్యానికి నెలవైన తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజక వర్గంలోని బిక్కవోలు మండలంలో చుట్టూ పచ్చని పొలాల మధ్య ప్రశాంతతకు మారు పేరుగా ఉండే బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ మహమ్మారి విలయతాండవం చేస్తోంది. రెండేళ్లుగా వేగంగా విస్తరిస్తూ ప్రజల ప్రాణాలు హరిస్తోంది. సుమారు 14 వేల జనాభా ఉండే ఈ గ్రామంలో ఏ వీధిలోకి వెళ్లినా క్యాన్సర్ బాధితులు కనిపిస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో ఒకరి కంటే ఎక్కువ క్యాన్సర్ రోగులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గురువారం ఈ అంశాన్ని శాసనసభలో ప్రస్తావించడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చలోకి వచ్చింది.

# ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

పుతిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ మాత్రం మాస్కో దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆరోపించింది. ఉక్రెయిన్‌లోని అణు విద్యుత్కేంద్రాలను అమెరికా స్వాధీనం చేసుకోనుందంటూ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కీవ్ వర్గాలు స్పందించాయి. ట్రంప్‌తో చర్చల్లో కేవలం జపోరిజియా అణుకేంద్రం ప్రస్తావనకు మాత్రమే వచ్చిందని వివరణ ఇచ్చాయి. జపోరిజియాపై అమెరికా యాజమాన్యం విషయంలో తాను ట్రంప్‌తో మాట్లాడినట్లు జరిగిన ప్రచారాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఖండించారు. ప్రస్తుత పరిస్థితికి పరిష్కారం ఎలా అనే అంశాన్ని.. రష్యన్ల నుంచి విద్యుత్కేంద్రాన్ని ఎలా తిరిగి తీసుకోవాలనే అంశాలను మాత్రమే చర్చించామన్నారు. అంతేకాదు.. తమ దేశ ఆస్తుల గురించి ట్రంప్‌తో ఏమాత్రం చర్చించలేదన్నారు. ప్రస్తుతం జపోరిజియా రష్యా అధీనంలో ఉన్నా.. ఉక్రెయిన్ పవర్‌గ్రిడ్‌కు అనుసంధానమై ఉంది. దీనినుంచి ఎటువంటి విద్యుత్తు ఉత్పత్తి కావడంలేదు. 2022లో ఉక్రెయిన్‌పై దాడి చేసిన తొలినాళ్లలోనే రష్యా సేనలు దీనిని ఆక్రమించాయి.

# ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నాం

* దొడ్డిదారిన భూములను విక్రయించారు
* బడ్జెట్‌పై చర్చలో విపక్షాల ఆరోపణలకు భట్టి సమాధానం

హైదరాబాద్: పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన భారాస సర్కారు ప్రభుత్వ వ్యవస్థలను విధ్వంసం చేసిందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లలో రూ.16.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని.. అయినా ఒక్క నాగార్జునసాగర్, శ్రీశైలం, విమానాశ్రయం, ఓఆర్‌ఆర్ అయినా నిర్మించిందా అని ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ, మండలిలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా విపక్ష నాయకులు లేవనెత్తిన విమర్శలకు ప్రభుత్వం తరఫున భట్టి సమాధానమిచ్చారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులకు బుద్ధిమాంద్యం అంటూ భారాస సభ్యుడు హరీశ్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గాలిలో మేడలు కట్టడం లేదని., అస్తవ్యస్తమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తాము గాడిన పెడుతున్నామని, అన్నివర్గాల ప్రజల కోసం ప్రతిపైసా వెచ్చిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ''రాష్ట్రంలో 2014 నుంచి 2023 నవంబరు వరకు భారాస పరిపాలన సాగింది. ఈ మధ్యకాలంలో రూ. లక్షల కోట్ల ఖర్చులు చూపించినా.. ఇంకా రూ. లక్షల కోట్ల బకాయిలు పెట్టారు. మరి భారాస ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఏం సాధించింది? కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా.. కనిపించకుండా చేసింది. పైగా 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మీరేం చేశారని తిరిగి ప్రశ్నిస్తున్నారు.

## * అంచనాలకు, వాస్తవాలకు పొంతన లేదు

భారాస ప్రభుత్వం పదేళ్ల బడ్జెట్‌లలో అంచనాలకు.. వాస్తవాలకు పొంతనలేదు. ఓఆర్‌ఆర్‌ను రూ.7,232 కోట్లకు 30 ఏళ్లకు లీజుకిచ్చారు. ఆబ్కారీ శాఖలో వచ్చే ఏడాదికి సంబంధించిన రూ.58,598 కోట్లు ముందే తీసుకున్నారు. 2014 నుంచి 2023..24 మధ్య భారాస ప్రభుత్వం అడ్డగోలుగా బడ్జెట్ పెంచుకుంటూ పోయింది. గత పదేళ్లలో గ్యాప్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన భారాస సగటున ఏటా 18 శాతం ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాప్ నిధులపై ఆలోచన చేసి 0.3 శాతం బడ్జెట్ మాత్రమే పెంచింది. 2025 26కు గత బడ్జెట్ కన్నా 4.7 శాతమే మేం పెంచాం. భారాసలా చేసినట్లయితే బడ్జెట్ రూ.4.18 లక్షల కోట్లు అయ్యేది. చేసేదే చెబుదామని, చెప్పిందే చేద్దామని సీఎం సూచించారు. గతప్రభుత్వం 202324లో 8.4 శాతం జీఎస్టీ వృద్ధిరేటు నమోదు చేయగా.. ఈ ఏడాది జనవరి వరకు 12.3 శాతం నమోదైంది. కేంద్రం సగటు 11.3 శాతం.. అంటే మనరాష్ట్రమే ఒకశాతం మెరుగ్గా ఉంది. 2014 నుంచి 2020 మధ్య శాసనసభ ఆమోదం లేకుండా భారాస ప్రభుత్వం రూ.2.89 లక్షల కోట్లు ఖర్చు చేసిందని కాగ్ తేల్చింది. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన రుణమాఫీ రూ.28,053 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే రూ.27,000 కోట్లు రుణాలు మాఫీ చేసింది. గత ప్రభుత్వం రోజుకు 30 వేల టన్నుల ఇసుక అమ్మింది. అప్పట్లో రోజుకు కోటిన్నర ఆదాయం వచ్చింది. ఇప్పుడు అదే ఇసుక విక్రయంతో రోజుకు రూ.3 కోట్లు వస్తోంది. అంటే గతంలో ఏడాదికి రూ.600 కోట్లు పక్కదారి పట్టింది. ఇసుక మాఫియా మాదిరిగానే క్రషర్లు, క్వారీలు ఇతర మాఫియాలకు అడ్డుకట్ట వేస్తాం.

## అప్పల భారం

భారాస ప్రభుత్వ హయాంలో రూ.6,69,257 కోట్ల మేర అప్పు చేసింది. మా ప్రభుత్వం వచ్చాక రూ.1,58,041 కోట్ల అప్పులు తెచ్చాం. అందులో రూ.1,53,369 వడ్డీలకు సరిపోగా మిగిలిన సొమ్ము రాష్ట్రావసరాలకు వినియోగించాం. యువత కోసం రాజీవ్ యువవికాసాన్ని అమలు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఈబీసీలకు దానిని వర్తింపజేస్తున్నాం. బ్రాహ్మణ పరిషత్ బడ్జెట్‌కు అదనంగా రూ.50 కోట్లు పెంచాం. వైశ్య కార్పొరేషన్‌కు రూ.23 కోట్లు ఇచ్చాం.

## ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

భారాస పాలనలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగింది. పదేళ్లలో రూ.70,475 కోట్ల నిధులు వినియోగం కాలేదు. 38.7 శాతం నిధులను వారు వదిలేస్తే.. మేం వాటిని వినియోగించేందుకు చర్యలు చేపట్టాం. గిరివికాసం ద్వారా దళితులను ప్రోత్సహిస్తున్నాం. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వందశాతం వినియోగిస్తాం. నిర్లక్ష్యానికి గురైన ఐకేపీ పథకాన్ని దారిలో పెడుతున్నాం. 'మహిళాశక్తి' ద్వారా అతివలను ప్రోత్సహిస్తున్నాం. అయిదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు లక్ష్యం. అందులో ఈఏడాది రూ.20 వేల కోట్లకు.. రూ.21 వేల కోట్లు రుణసాయం అందింది. ఇంకా మంచి పథకముంటే చెప్పండి అమలు చేస్తాం. ఇంటికో ఉద్యోగం చెప్పి గత ప్రభుత్వం మోసం చేసింది. మేం వచ్చాక పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను ప్రక్షాళన చేసి 57,946 ఉద్యోగాలను భర్తీ చేశాం. గత సర్కారు వైఫల్యం వల్ల రాష్ట్రానికి కృష్ణా, గోదావరి జలాలు అందని పరిస్థితి ఏర్పడింది. 11 టీఎంసీల కృష్ణా నీరు తెలంగాణకు రాకుండా ఆంధ్రాకు పోతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడం వల్ల గోదావరి నీరు రావడం లేదు. భారాస ప్రభుత్వ హయాంలో లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించకుండా పోయింది. వారంతా బిడ్డల పెళ్లిళ్లు, చదువుల కోసం క్రమబద్ధీకరించాలని కోరితే 25 శాతం రాయితీతో పారదర్శకంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ భూములను అమ్మడంలేదు. గత ప్రభుత్వం ఒక్క గురుకులాన్నీ నిర్మించకుండా.. అద్దెభవనాల్లో, కోళ్లఫారాల్లో కొనసాగించింది. మేం 58 సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నాం. విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచాం. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను పెంచుతున్నాం. బోధనారుసుం విడుదల చేశాం'' అని భట్టి తెలిపారు.

# వడగళ్లు తెచ్చిన నష్టం

(మొదటిపేజీ తరువాయి)

కాపాడుకున్న పంట పది నిమిషాల్లో నేలపాలైదంటూ రైతులు కన్నీరుమున్నీరయ్యారు. కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగాంబస్తీలో ఇంటి గోడ కూలి చందెకర్ దౌలత్(79) అనే వ్యక్తి మృతిచెందారు. మరోవైపు అప్పటి దాకా మండుటెండలో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా కురిసిన వర్షాలతో చల్లదనాన్ని ఆస్వాదించారు. ఉపరితల ఆవర్తన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి హైదరాబాద్ నగరంలో గాలులు వీచాయి. మధ్యాహ్నం తర్వాత వాతావరణం మేఘావృతమైంది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.8 డిగ్రీలకు తగ్గడంతో జనం ఎండ నుంచి ఉపశమనం పొందారు. రాష్ట్రంలో అన్నిచోట్లా సాధారణం కన్నా దిగువకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శని, ఆది, సోమవారాల్లోనూ పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని సూచించింది. గాలి వేగం గంటకు 30 40 కి.మీ. ఉండే అవకాశం ఉందని వెల్లడించింది.

# 'పది' పరీక్షల తొలిరోజే కలకలం

(మొదటిపేజీ తరువాయి)

ఘటనకు సంబంధించి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్(డీఓ)ను సస్పెండ్ చేయగా నల్గొండలో ఇద్దరిని రిలీవ్ చేయగా ఒకరిని సస్పెండ్ చేశారు. వరంగల్ జిల్లాలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు కృష్ణారావు ప్రకటించారు. శుక్రవారం ప్రథమ భాష(తెలుగు, ఉర్దూ తదితర)కు రెగ్యులర్ విద్యార్థులు 4,96,549 మందికి 4,94,887 మంది(99.67 శాతం) హాజరయ్యారు. రెండు గంటలు ఆలస్యంగా..: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలు దాటినా ప్రశ్నపత్రం ఇవ్వలేదు. పోలీసు స్టేషన్ నుంచి తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం రావడంతో కేంద్రం అధికారులు కంగారుపడ్డారు. చీఫ్ సూపరింటెండెంట్ సఫ్దర్‌అలీఖాన్, డీఈవో యాదయ్య సమాచారంతో కలెక్టర్ కుమార్ దీపక్ పరీక్ష కేంద్రానికి చేరుకొని ఉన్నతాధికారులకు తెలియజేశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తిరిగి సరైన ప్రశ్నపత్రాలు తీసుకొచ్చి 11.30 గంటలకు పరీక్ష ప్రారంభించి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరిచే పెట్టెలో మొదటి రోజుకు సంబంధించి తెలుగుకు బదులుగా రెండో రోజుకు సంబంధించి హిందీ ప్రశ్నపత్రాన్ని ఉంచారన్నారు. సదరు ప్రశ్నపత్రం కట్టను తెరవకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నకిరేకల్‌లో ఉదయం 10 గంటల ప్రాంతంలోనే వాట్సప్‌లో ప్రశ్నపత్రం ప్రత్యక్షమైంది. జవాబు నకలు చీటీలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జిల్లా అధికారుల ఫోన్లకు కూడా ఇవి చేరడంతో వారు నకిరేకల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. ప్రశ్నపత్రం పేజీలపై ముద్రించిన కోడ్ నంబర్‌ను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రం నుంచి ఇవి బయటకు వచ్చినట్లు గుర్తించారు. పరీక్ష కేంద్రం అధికారులను నల్గొండలోని ఓ ప్రదేశంలో రహస్యంగా విచారించారు.

# నూతన కోర్టు భవనాల నిర్మాణాలకు రూ.1000 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

55,000 మందికి రూ.2లక్షల పరిమితితో హెల్త్‌కార్డులు జారీ చేస్తున్నాం. రూ.10 లక్షల ప్రమాద బీమా కూడా కల్పిస్తున్నాం. న్యాయవాదుల భద్రత కోసం చట్టాన్ని తీసుకొస్తాం. వామనరావు దంపతుల దారుణహత్య ఘటన.. న్యాయవాదులకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది'' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో చర్చలో భాగంగా భారాస ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమ నిధికి భారాస హయాంలో రూ.100 కోట్ల నిధిని ఏర్పాటు చేశామని.. ప్రస్తుత ప్రభుత్వం మరో రూ.100 కోట్లు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ భారాస ప్రభుత్వ హయాంలో ఇద్దరు న్యాయవాదులు హత్యకు గురయ్యారన్నారు. ఆ ఘటనతో ప్రమేయం ఉన్న వ్యక్తిని అసెంబ్లీ ఎన్నికల్లో భారాస పోటీ చేయించిందంటూ తప్పుబట్టారు. దీనిపై ప్రశాంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సభాపతి ప్రసాద్‌కుమార్ స్పందించి రికార్డుల్ని పరిశీలించి తొలగిస్తామన్నారు. ఈ బిల్లు సవరణతో జూనియర్ న్యాయవాదులపై ఆర్థిక భారం తగ్గించాలని భారాస ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విజ్ఞప్తిచేశారు. చర్చ అనంతరం ఈ రెండు బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది.

# తక్కువ వడ్డీకి రుణాలివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

గోదాములు, రైస్‌మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ సామర్థ్యం పెంచేందుకు సహకరించాలి. స్వయం సహాయక మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తున్న సౌరవిద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో నాబార్డు భాగస్వామిగా చేరాలి'' అని కేవీ షాజీని కోరారు. 202425 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు నిధులను ఈ నెల 31లోగా ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్త జిల్లాలన్నింటిలోనూ డీసీసీబీలు ఏర్పాటు చేయాలని షాజీ సీఎంను కోరారు. సమావేశంలో నాబార్డు ఏజీఎం ఉదయ్‌భాస్కర్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆదర్శ రైతుల నియామకానికి వినతి

రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి గ్రామాల్లో ఆదర్శ రైతు వ్యవస్థను, గ్రామీణ సాగునీటి పర్యవేక్షణ కోసం నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కోరారు. శుక్రవారం శాసనసభ ప్రాంగణంలో ఆయన తమ సభ్యులతో సీఎంను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

## ముఖ్యమంత్రికి బీసీ కమిషన్ కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బీసీ కమిషన్ శుక్రవారం ఆయన కార్యాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి... సీఎంను సత్కరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్ల బిల్లును ఉభయసభల్లో ప్రవేశపెట్టి, ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటులోనూ దీని ఆమోదానికి చొరవ తీసుకోవాలని విన్నవించారు. అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను సైతం బీసీ కమిషన్ వారి కార్యాలయాల్లో సన్మానించింది.

# గాజాను ఆక్రమించమని సైన్యాన్ని ఆదేశించా

(మొదటిపేజీ తరువాయి)

మరిన్ని ప్రాంతాలను ఆక్రమించాలని సైన్యాన్ని ఆదేశించాను. హమాస్ జాప్యం చేస్తున్న కొద్దీ.. మరిన్ని భూభాగాలను ఇజ్రాయెల్‌లో కలుపుకుంటాం'' అని కాట్జ్ తెలిపారు. ఇజ్రాయెల్ తీరును ఫ్రాన్స్ తప్పుబట్టింది. గాజా లేదా వెస్ట్‌బ్యాంక్‌లోని భూభాగాలను ఆక్రమించుకోవడానికి తమ దేశం వ్యతిరేకమని తెలిపింది. ''ఈ విషయంలో మేం చాలా స్పష్టంగా ఉన్నాం. సమస్యకు ద్విదేశ పరిష్కారమే మార్గం. రెండు దేశాలు ఒకదానిపక్కన ఒకటి శాంతితో నివసించాలి'' అని ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జీన్ నోయెల్ బారెట్ తెలిపారు.

## అంతర్గత నిఘా విభాగాధిపతిపై నెతన్యాహు వేటు

ఇజ్రాయెల్ అంతర్గత నిఘా విభాగం షిన్‌బెట్ అధిపతి రొనెన్ బార్‌పై శుక్రవారం ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వేటు వేశారు.

# శ్రీ జయ ఫార్మా పరిశ్రమను శాశ్వతంగా మూసివేయాలి

- : హైకోర్టును ఆశ్రయించిన బాధితులు
- * పరిశ్రమ వెనక భాగంలో ఊరుతున్న వ్యర్థజలాలు
- * కనిపించకుండా పైకప్ప ఏర్పాటు చేస్తున్న పరిశ్రమ యాజమాన్యం









చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ జయ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను శాశ్వతంగా మూసి వేయాలని కోరుతూ బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. పరిశ్రమ చేస్తున్న కాలుష్యం, పిసిబి అధికారుల నిర్లక్ష్యం గురించి అంతమ్మగూడెం గ్రామానికి చెందిన రైతులు గుమ్మి దామోదర్ రెడ్డి, గుమ్మి నరేందర్ రెడ్డి, వస్పరి నర్సింహ్మాలు తెలంగాణ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా శుక్రవారం వాదనలు జరిగాయి. గత మూడు సంవత్సరాలుగా గ్రామస్తులు పరిశ్రమ కాలుష్యం గురించి పిసిబి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ, పరిశ్రమల యాజమాన్యంతో అవగాహన కుదుర్చుకున్న పిసిబి అధికారులు కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ పరిశ్రమలకు కాలపరిమితితో కూడిన షరతులు విధిస్తూ తాత్కాలిక అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమల యాజమాన్యం గత అక్టోబర్ 2020నందు క్లోజర్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ పరిశ్రమ యధావిధిగా నడిపారు. రసాయన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వదిలేసినప్పటికీ గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా కంటి తుడుపు చర్యగా రికార్డుల ప్రకారం క్లోజర్ ఆర్డర్ ఇస్తూ పరిశ్రమ నడిచినా, పిసిబి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ కాలుష్యంపైన ఎన్జీటీ నందు విచారణ జరుగుతున్నప్పటికీ, ఎన్జీటీకి నివేదికలు అందజేయాల్సిన పిసిబి అధికారులు పరిశ్రమ యాజమాన్యం ప్రలోభాలకు గురై, సరైన నివేదికలు అందజేయడం లేదని ఆవపిస్తున్నారు. పరిశ్రమ లోపల బయటకు కనపడకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి రసాయన వ్యర్థాలను వదిలివేస్తున్నందున భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతున్నాయని లబోదిబోమంటున్నారు.

పరిశ్రమ వెనుక భాగంలో ఉన్న ట్రెంచ్ నందు గత మూడు సంవత్సరాలుగా రసాయన వ్యర్థాలు ఊరుతూనే ఉన్నాయి, కానీ పీసీబీ అధికారులకు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత డిసెంబర్ 23న కమిటీ సభ్యులు తనిఖీలు నిర్వహించిన తర్వాత కూడా పరిశ్రమ యాజమాన్యం రసాయన వ్యర్థాల నియంత్రణకు చర్యలు తీసుకోలేదు. రసాయన వ్యర్థాలను తరలించి మూసీ నదిలో వదిలివేయుటను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొనుటకు క్రిమినల్ కేసులు పెట్టకుండా, ఈ నెల 1న ఫిర్యాదుదారుల ఒత్తిడి మేరకు తాత్కాలికంగా క్లోజర్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ, రాత్రి సమయంలో పరిశ్రమ నడుపుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గత 2022సంవత్సరం నందు రసాయన వ్యర్థాలను తరలించి స్పెక్ట్రా కెమ్ పరిశ్రమ వద్ద అధిక సంఖ్యలో డ్రమ్ములలో రసాయన వ్యర్థాలను వదిలేసినా, ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ట్యాంకర్ ద్వారా తరలించి వదిలేసినా, రాత్రి సమయంలో మినీ వాహనాలు ట్యాంకర్ల ద్వారా రసాయన వ్యర్థాలను తరలించి మూసీ నదిలో వదిలినా, పిసిబి అధికారులు చర్యలు తీసుకోని కారణంగానే రైతులు హైకోర్టును ఆశ్రయించారు. పరిశ్రమలు ఇచ్చే తాయిలాల ప్రలోభాలకు గురైన కొంతమంది స్వార్థం కారణంతో, గ్రామస్తులు ఐకమత్యంగా లేకపోవడాన్ని అనుకూలంగా మార్చుకున్న పరిశ్రమ యాజమాన్యం విపరీతమైన కాలుష్యానికి పాల్పడుతున్నారు. దీంతో కాలుష్య కారక పరిశ్రమలపై, సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత బాధితులు హైకోర్టును ఆశ్రయించారు.

## బీఎస్పీ పార్టీ బలోపేతంమే లక్ష్యంగా పని చేయాలి

- * కత్తుల కాన్షీరాం



చందూరు, ప్రజాస్ఫూర్తి: మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా బీఎస్పీ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని నల్గొండ జిల్లా ఇన్చార్జి కత్తుల కాన్షీరాం, నల్గొండ జిల్లా అధ్యక్షులు మామిడి సైదులు అన్నారు. చందూరు మండల కేంద్రంలో బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గం సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా నల్గొండ జిల్లా ఇన్చార్జి కత్తుల కాన్షీరాం, నల్గొండ జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులు హాజరై మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గం వ్యాప్తంగా బీఎస్పీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ బలోపేతం చేయడానికి కావాల్సిన పలు సలహాలు, సూచనలు చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ చేయాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించారు. అనంతరం నియోజకవర్గ ఉపాధ్యక్షుని బుట్ట శివ, ప్రధాన కార్యదర్శిగా కన్నెపాక శంకర్, కోశాధికారిగా మాణిక్యంలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్య క్షుడు తక్కినపల్లి శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడి భీమ్ ప్రసాద్, మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ నేరెళ్ల ప్రభుదాస్, నియోజకవర్గ నాయకులు, స్మార్ట్ కిరణ్,మహేష్, శోభన్ బాబు, రవితేజ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఫ్లయింగ్ స్క్వాడ్ నాగవర్ధన్ రెడ్డి బృందం



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలంలోని మూడు ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను మొదటిరోజు శుక్రవారం తెలుగు పరీక్ష సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ నాగవర్ధన్ రెడ్డి బృందం ఆకస్మికంగా సందర్శించారు. నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాజపేట ఎస్సై అనిల్ కుమార్ రఘునాథపురం రాజపేటలోని పరీక్షా కేంద్రాల పరిసరాలను పోలీసు బృందంతో కలిసి పరిశీలించారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని గుర్తు చేశారు. ఓడు పరీక్షా కేంద్రాలలో ఇద్దరు బాలికలు గైర్హాజరైనట్లు ఎంఈఓ చందా రమేష్ తెలిపారు. అందులో ఒకరు ఇటీవల మృతి చెందాగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరీక్ష రాసేందుకు సెంటర్ లోకి వెళుతున్న సమయంలో ప్రతి విద్యార్థిని ఎంఈఓ చందా రమేష్ బృందం చెక్ చేశారు.

## రాబిన్ ఫుడ్ మూవీ లోని మహిళలను కించపరిచే సన్నివేశాలను తొలగించాలి

- * న్యాయవాదులు నర్రి స్వామి, దయ్యాల మానిక్




యాదాద్రి భువనగిరి , (ప్రజాస్ఫూర్తి) : హైదరాబాదులోని కేంద్రీయ చలనచిత్ర సెన్సార్ బోర్డు కార్యాలయం ని తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లాయర్స్ పోరంపర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ లాయర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బీజేపీ లీగల్ నాయకుడు దయ్యాల మాణిక్యరావులు సెన్సార్ బోర్డ్ సభ్యులను కలిసి రాబిన్ హుడ్ సినిమాలోని ఐటెం సాంగ్ లలో ఉన్నటువంటి అశ్లీల దృశ్యాలను మరియు మహిళలను కించపరిచే మహిళల గౌరవాన్ని తగ్గించే విషయాలను తొలగించాలని సూచించడం జరిగింది. ఈ సందర్భంగా లాయర్స్ ఫోరం పర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామి మాట్లాడుతూ భారత దేశము మహిళలకు ఎంతో ఉన్నతమైనటువంటి గౌరవాన్ని ఇస్తూ ఒక మాతృమూర్తిగా భరతమాతగా పూజిస్తుంది కానీ రాబిన్ హుడ్ సినిమాల్లో మహిళా తన యొక్క ఎక్స్పోజర్ తో యువతని పక్కదారి పట్టించే విధంగా హిందూ సంప్రదాయాలను కించపరిచే విధంగా నటించడం జరిగింది. కాబట్టి ఆ రాబిన్ ఫుడ్ సినిమాలో ఉన్న సన్నివేశాలను వెంటనే తొలగించాలని మా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక నుంచి డిమాండ్ చేస్తున్నాం వీలైతే మా తెలంగాణ లాయర్స్ పోరంపర్స్ సోషల్ జస్టిస్ నుంచి హైకోర్టులో లీగల్గా ఫైట్ చేస్తామని తెలియజేస్తున్నామన్నారు

## నర్సింగ్ వసతి గృహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వసతి గృహాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహంలో విద్యార్థినిలకు అందిస్తున్న సదుపాయాల, వసతి గృహంలో ఉంటున్న వారి సంఖ్య గురించి హాస్టల్ వార్డెన్ , అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని అన్ని గదులను, మరుగుదొడ్లను, కిచెన్, త్రాగునీటి సౌకర్యం తదితర అన్ని సదుపాయాల్ని కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం 140 మంది విద్యార్థులు కు కలిపి ఒకటే పెద్ద హాలు లో ఉండటం గమనించిన ఆయన గదులుగా పార్టీషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని హాల్లో ఎండ వేడి అధికంగా ఉండటం గమనించిన కలెక్టర్ ధర్మకోల్ తో సీలింగ్ ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అన్ని గదులలో కూలర్లు రేపటిలోగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు త్రాగునీటి కొరకు ఫ్రిజ్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వసతి గృహం చుట్టూ ప్రహరీ గోడను పరిశీలించిన కలెక్టర్ ఎత్తు తక్కువగా ఉండటానికి గమనించి, విద్యార్థినిలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రహరీ గోడ పైన అదనంగా షీట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వసతి గృహం లో విద్యార్థులు భద్రతకు గాను సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థినిలు ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు అన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం,శుద్ధ జలం అందించాలని వార్డెన్ కు సూచించారు. వసతి గృహ నిర్వహణపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎటువంటిఅసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట వసతి గృహం వార్డెన్, సిబ్బంది , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హర్యానా రాష్ట్రంలో ఛాంపియన్షిప్ సాధించిన డిఈ రూప్లా నాయక్

- * అభినందించి సత్కరించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ఇరిగేషన్ డి. ఈ. రూప్లా నాయక్ హర్యానా రాష్ట్రంలో ఛాంపియన్షిప్ సాధించి ప్రత్యేకంగా గుర్తింపు సాధించడంతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఇరిగేషన్ డి.ఈ రూప్లా నాయక్ 2 మెడల్స్ ను సాధించినట్లు చెప్పారు. ఐదు కిలోమీటర్ల విభాగంలో బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డుతో, 1500 మీటర్ల పరుగు పందెంలో మాస్టర్ గేమ్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఛాంపియన్షిప్ 2025 ను దక్కించుకొని గోల్డ్, సిల్వర్ మెడల్ లను కూడా పొందినట్లు చెప్పారు. ఏఐసిఎస్ అథ్లెటిస్ స్టేట్ ఛాంపియన్షిప్ ను రూప్లా నాయక్ సాధించినట్లు వివరిస్తూ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, రాజపేట పట్టణ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా నాయ కులు ఇంజ నరేష్ కుమార్ తదితరులున్నారు.

## విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు

- * ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 30శాతం నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాష్, తీగుళ్ళ శ్రీనివాస్ లు ఆరోపించారు. ప్రభుత్వం విద్యారంగానికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యలో చౌటుప్పల్ మండల కేంద్రం జాతీయ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ లకు సంబంధించింది రూ.8వేల కోట్ల దాకా పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి కేటాయించిన రూ.23వేల కోట్లు బడ్జెట్లో కేవలం 7.57శాతం మాత్రమే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ విద్యా సంస్థలు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు హాస్టల్స్, గురుకులాలు, యూనివర్సిటీలు అభివృద్ధి కావాలంటే 30శాతం నిధులు విద్యా రంగానికి కేటాయిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని ఏర్పాటుచేసి, పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు దోనూరి శ్రావణ్ రెడ్డి, నాయకులు సాగర్, అజయ్, మల్లేష్,సాయి, చందు,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల బంగారు భవిష్యత్తు, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దేవే ప్రభుత్వ పాఠశాలలు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు క్రమశిక్షణ కల్గిన పౌరులుగా తీర్చిదిద్దేవే ప్రభుత్వ పాఠశాల అని రాజాపేట ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సట్టు జయంత అన్నారు. శుక్రవారం నెమిల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనం పరిశీలించి సంతృప్తి చెంది పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం పౌష్టికహారం అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి రోజు పేద పిల్లలకు రాగి జావా, కోడిగ్రుడ్లు అందించేలా ప్రాధనోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవడం పట్ల అభినందించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమ్మిలిత విద్య తో పాటు రవాణాభత్యం, స్టైఫండ్, రీడర్ సదుపాయాలు, సహాయోపకారణాలు ప్రభుత్వము అందిస్తుందన్న విషయాల పై అవగాహన కల్పించినారు. రికార్డులను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నెమిల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమిల భరత్ కుమార్ ఉపాధ్యాయులు మమత, భార్గవి, రజిత, సుజాత క్లస్టర్ రీసోర్స్ పర్సన్ జమాల్పురం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 28న ప్రజా సమస్యల పరిష్కారం కై సిపిఎం పాదయాత్ర

యాదాద్రి భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : స్థానిక ఆర్యవైశ్య భవనంలో వడ్డేమాన్ బాలరాజు అధ్యక్షతన శుక్రవారం సిపిఎం పట్టణ జనరల్ బాడీ సమావేశము జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాట్లాడుతూ ఆలేరు పట్టణంలో పేరుకుపోయిన ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జన చైతన్య పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని పేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు రేషన్ కార్డులు బీడీ కార్మికుల పెన్షన్లు వృద్ధాప్య, వితంతు ఒంటరి మహిళలు ఎన్నో ఏండ్లుగా పెన్షన్లు అందక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని వందలాది కుటుంబాలు సొంతింటి కలను తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని అదేవిధంగా ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల మౌలిక వసతులు కల్పించడంలో ఘోరంగా విఫలమైందని పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు గంధ మల్ల రిజర్వాయర్ నిర్మాణము ఆలేరు పెద్దవాగు బ్రిడ్జి వెడల్పు చేయడం పెద్దమ్మ గుడి నుండి ఈదమ్మ గుడి వరకు వరద కాలువ నిర్మాణం ఈదుల వాగు రత్నాల వాగులపై హై లెవెల్ బిరుదుల నిర్మాణం కబ్జాలకు గురవుతున్న చెరువులను కాపాడడం ఆలేరుకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం మున్సిపాలిటీకి సొంత భవనం ఏర్పాటు చేయడం కోర్టుకు సొంత భవనము నిర్మాణం కాలనీలలో అస్తవ్యస్తమైన మురుగు కాలువల నిర్వహణ సీసీ రోడ్లు నిర్మాణం ఇతర అనేక సమస్యలతో ఆలేరు పట్టణ ప్రజలు బాధలు దినదిన గండంగా గడుపుతున్నారని వాటిని సాధన కోసం ప్రజలను చైతన్యం చేయడం కోసం సిపిఎం జన చైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు పట్టణంలోని ప్రతి ఇంటిని కలిసి వారి సమస్యలను తెలుసుకోవడం అనంతరం 29న మున్సిపల్ ఆఫీసు ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గమని దానికి ఇంకో మార్గం లేదని ప్రజలు చైతన్యంతో కదిలి సమస్యల పరిష్కారం కోసం జన చైతన్య పాదయాత్రలో సిపిఎం నాయకులతో కలిసి నడవాలని ఈ సందర్భంగా ఆయన ఆలేరు పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇగ్బాల్, మోరిగాడి రమేష్, మోరిగాడి చంద్రశేఖర్, ఘనగాని మల్లేష్, బొప్పిడి యాదగిరి, మోరిగాడి అశోక్, రాజేష్, అంజయ్య, చెక్క పరశురాములు, మురిగాడి లక్ష్మణ్, ఘనగాని రాజు, వడ్డెమాను విప్లవ్, కటకం సుదర్శన్, మోరిగాడి స్వరూప, ఐలి చంద్రకళ, మైలారం కళ్యాణి, రచ్చ వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.




## డిఎస్ఆర్ సత్యం ఫౌండేషన్ ఆర్థిక చేయూత..



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన స్పందన అనే విద్యార్థినికి బి జెడ్ సి సెమిస్టర్ ఫీజు సంబంధించి రూపాయలను శుక్రవారం డిఎస్ఆర్ సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ దోనాలా శ్రీనివాస్ రెడ్డి.. అందించి ఆసరాగా నిలిచారు. అనంతరం వారు మాట్లాడుతూ డి ఎస్ ఆర్ సత్యం ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు చదువులకై ఎల్లప్పుడూ చేయూతని అందిస్తామన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

*** ఓరుగంటి అఖిల్ సాయి గౌడ్**



యాదాద్రి భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన నిరు ద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని చింతల్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి అఖిల్ సాయి గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం ద్వారా ఎస్సీ,ఎస్టీ, బిసి,మైనార్టీ వర్గాలకు చెందిన యువతకు 400000/ వరకు ఆర్థిక సాయం అందిస్తున్నారు మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.లోన్ మొత్తాన్ని బట్టి 60 నుంచి 80 శాతం వరకు ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ 2 తేదీన రాయితీ రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

## విద్యారంగంపై కాంగ్రెస్ సర్కార్ ది సవతి తల్లి ప్రేమ

*** బీఆర్ఎస్వీ నాయకుడు వి. అశ్వంత్ కుమార్**




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై సవతితల్లిప్రేమ చూపిస్తోందని బీఆర్ఎస్వీ నాయకుడు వి. అశ్వంత్ కుమార్ ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడిగా ఉందని, తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ విద్యా రంగానికి 7.5శాతం నిధులను మాత్రమే కేటాయించడం సిగ్గు చేటన్నారు. గత బడ్జెట్ 2024 25లో విద్యా రంగానికి రూ.21389 వేల కోట్లకు కేటాయిస్తే ఈ 202526, 23,108 కోట్లు కేటాయించిందన్నారు. దేశంలోని రాజస్థాన్, ఢిల్లీ లాంటి రాష్ట్రాలు విద్యపై 20శాతం పైగా ఖర్చు పెడుతుంటే మన రాష్ట్ర ప్రభుత్వం విద్యపై పెట్టే ఖర్చు 7 శాతం దాటలేకపోతుందని ఆయన విమర్శించారు. గత ఎన్నికల సమయంలో విద్యా రంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని ప్రగల్బాలు పల్కి, పోయినా బడ్జెట్లో, ఈ బడ్జెట్ లో కూడా నిరాశనే మిగిల్చిందన్నారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ విద్యారంగంపై సవితితల్లి ప్రేమ చూపిస్తున్నది, గత సంవత్సర బడ్జెట్ లోకేవలం 7.3శాతం నిధులే కేటాయించి, వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదని, చిన్న రాష్ట్రాలైన ఈశాన్య రాష్ట్రాల్లో సైతం వాటి బడ్జెట్లో 1213శాతం నిధులు కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో అరకొర నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 90శాతం మంది విద్యార్థులు బీసీ ఎస్సీ ఎస్టీ బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులేనని, వారందరూ కూడా స్కాలర్షిప్స్ మీద ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారన్నారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో బీఆర్ఎస్వీ విదా విభాగం ఉద్యమిస్తుందని ఆయన హెచ్చరించారు.

## జర్నలిస్టులకు నిరసన కార్యక్రమానికి వివిధ పార్టీల, సంఘాల మద్దతు




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జర్నలిస్టు లకు ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం జర్నలిస్టు లు చేస్తున్న నిరసన కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి, మద్దతు ప్రకటించాయి. బీ ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు నవతన్ మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ ను వెంటనే తీర్చాలని, వారికి ఉచితంగా ఇండ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు.. అవసరమైతే వారి పక్షాన ఆమరణ దీక్షకైన సిద్ధమని ప్రకటించారు. ఢిల్లీ నుండి గల్లి దాక నిత్యం సమాజంలో జరిగే కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ , చాలి చాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్న జర్నలిస్టు లకు ఇండ్ల స్థలం ఇచ్చి , రు. 5లక్షలు మంజూరు చేయాలన్నారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి , బీ సీ సంఘం రాష్ట్ర నాయకులు మల్లెల రామనాథం జర్నలిస్టు ల కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఇండ్ల స్థలాలు జర్నలిస్టు ల హక్కు అని, వారికి సాధారణ రేట్ తో ఇండ్ల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎకరానికి రూ.2.30కోట్లు కట్టాలని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అరకొర జీతాలతో సంస్థలలో పనిచేస్తున్న వారికి కోట్ల రూపాయలు చెల్లించాలనడం ముర్కత్వామన్నారు. జర్నలిస్టు ల న్యాయమైన కోరికను పార్టీ అధ్యక్షులు ఎం ఎల్ సీ కోదండరాం దృష్టికి తీసుకు వెళ్లి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బిజెపి రాష్ట్ర నాయకులు కె.వి. రంగా కిరణ్ మాట్లాడుతూ జర్నలిస్టు లు గత 10 సంవత్సరాలుగా ఆనేక ఉద్యమాలు చేస్తున్నారని, కానీ ఎకరానికి రూ.2.30కోట్లు చెల్లించలనడం దుర్మార్గమని , వారికి పూర్తిగా ఉచితంగా స్థలం ఇవ్వాలని అదే విధంగా పిఎం అవాస్ యోజన పథకం వర్తింపజేయాలి అని డిమాండ్ చేశారు. ఈ అంశం పై బీజేపీ అగ్ర నాయకుల దృష్టికి తీసుకు వెళతానని జర్నలిస్టు లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్, రాయుడు నాగేశ్వర్ రావు, ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు లు జనుమల రమేష్, కల్లోజీ శ్రీనివాస్ , టి.వి.నాగచారి, వి. సతీష్, జాన్సన్, సింగం అరుణ్ కుమార్, బి.రాందాస్, కె. శ్రీనివాస్, జోగాం తారక్, వట్టికొండ రవి, ఇళ్ళందుల దుర్గ, కొట్టే శివ శంకర్ ప్రభాకర్ రెడ్డి, రాము, ప్రవీణ్, కృష్ణారావు, రుద్ర రాజ శేఖర్, పోలిశెట్టి రాజశేఖర్, వీరు నాయక్, అఫ్జల్ పఠాన్, ఈశ్వర్, పురం శ్రీనివాస్, పిట్టల రమేష్, ఆనంద్, చింతల చిరంజీవి, బీర రవి, ఖాజా , సత్య ప్రకాష్ నాగరాజు, తాండ్ర రాజ్ కుమార్, గొర్ల సురేష్, వెన్నం సతీష్, చింతాల వెంకటనర్సింహారావు, కోడూరి సూర్య, తదితరులు పాల్గొన్నారు.



## మహాసభలను జయప్రదం చేయండి

*** టీజీవో అధ్యక్షులు వెంకట పుల్లయ్య**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఈనెల 23న కొత్తగూడెం క్లబ్ లో జరుగనున్న ప్రకృతి ఆరోగ్య మహాసభలను విజయవంతం చేయాలని, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, సంగం వెంకట పుల్లయ్య విజ్ఞప్తి చేశారు.శుక్రవారం బస్టాండ్ సమీపంలో గల ప్రకృతి ఆశ్రమం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆశ్రమం ముఖ్య సలహాదారు వెంకట పుల్లయ్య పాల్గొని మాట్లాడారు.శారీరక, మానసిక ఆరోగ్యాలతో పాటు, పర్యావరణ ప్రకృతి పరిరక్షణలపై వక్తలు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజు , జి.కవిత నాయుడు సింగరేణి జనరల్ మేనేజర్ (పర్సనల్), ఎల్ భాస్కర్ నాయక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అబ్దుల్ రహమాన్ కొత్తగూడెం డిఎస్పి,మున్సిపల్ కమిషనర్ సుజాత లు పాల్గొని తమ సందేశాలు ఇస్తారని వెల్లడించారు. ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఒత్తిడిని జయించడం ఎలా, జల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం, ఆనందమయ జీవితం మొదలైన అంశాల పైన, ముఖ్య వక్తలుగా ప్రముఖ ప్రకృతి కవి, కాళోజీ అవార్డు గ్రహీత, కొత్తగూడెం ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు జయరాజు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్, రెండు తెలుగు రాష్ట్రాల 'స్టెప్' సమన్వయకర్త, డా. ప్రత్యూష సుబ్బారావు,ప్రముఖ సీనియర్ సర్జన్, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డా.వి. రమేష్ బాబు,సీనియర్ ఆకుపంచర్ తెరపిస్ట్ డా. అనిల్ కుమార్ తెంబరేని.,జాతీయ జల సాధన సమితి అధ్యక్షులు, ఫ్లోరోసి స్ నివారణ ఉద్యమ నేత, సహజ అడవి సృష్టికర్త దుశర్ల సత్యనారాయణ, ప్రముఖ ప్రకృతి వ్యవసాయకులు, వరల్డ్ మిలీనీర్ రైతు అవార్డు గ్రహీత లోకసాని పద్మా రెడ్డి,సింగరేణి రిటైర్డ్ జిఎం శనగ వెంకటేశ్వరరావు,లు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. అన్ని రకాల ఆరోగ్యాల పైన, సమగ్ర మైనటువంటి అవగాహన పెంచుకునేందుకు, ప్రధానంగా మానసిక ఒత్తిడీలను జయించేందుకు, నాలెడ్జ్ సమూపార్జనకు ఈ సభలలో పాల్గొనాలని వెంకట పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం క్లబ్లో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు జరుగుతాయన్నారు. భోజన వసతులు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహాసభ పర్యంతం ఆరోగ్య కార్యకర్తల, గాయకుల, గేయాలు పాటలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆశ్రమ సలహాదారు జినుగు బాలశౌరి, కో ఆర్డినేటర్ జి. సుగుణ రావు, కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, తుంపురు శివ,సబ్బన రాజేష్, కొత్తపల్లి రమేష్ బాబు, శంకర్ బంగారి, దయానంద సాగర్, కృష్ణకుమారి లు పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు అందజేత




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కరోన సమయంలో ఎంతో మందికి యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సహాయం చేసి ఆదుకున్నారని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జయశంకర్ కాలనీలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారి ఆధ్వర్యంలో, జె.టి.ఎక్స సంస్థ వారి సహకారంతో డివిజన్ లోని మహిళలకు ట్రైనింగ్ ఇచ్చి వారి నైపుణ్యాలకి అనుగుణంగా వారికి కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ఆయన చేతులమీదుగా కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ లో ఉన్న పేద మహిళలకు వారికి ఆసక్తి ఉన్న రంగాలలో శిక్షణ ఇస్తూ, చిన్న పిల్లలకు చదువులు చెప్తూ, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలియచేసారు. భవిషత్తులో కూడా ఇటువంటి మంచి కార్యక్రమాలు చేసి డివిజన్ లో ఉన్న పేద వారికి ఆసరాగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, పోశెట్టిగౌడ్, యాదగిరి, కుమార్, షేక్ బీబీ, యునైటెడ్ వే ఆ హైదరాబాద్ సభ్యులు కె.రాములు, ప్రశాంత్, పి.రమేష్, టి.శ్రీపతి, ఎం.అక్షిత, కె.లక్ష్మి, ఈ. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి రోజు పది పరీక్షలు ప్రశాంతం

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం పదవ తరగతి పరీక్షల ప్రారంభంలో భాగంగా తొలిరోజు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని లిటిల్ బర్డ్స్ పాఠశాల , పాల్వంచలోని కేటీపీఎస్ కాలనీలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఏర్పాటుచేసిన వసతులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష రాసే తరగతులను, సీసీ కెమెరాలు అమరిక, పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు , విద్యార్థులు కూర్చుని పరీక్ష రాసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన బెంచీలను గమనించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పరిక్షా కేంద్రాల చుట్టూ ప్రహరీ గోడలు సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని చిత్తు కాగితాలు లేకుండా, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిబంధన ప్రకారం వసతులు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లకు లోను కాకుండా పరీక్షలు మంచిగా రాయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా మొదటిరోజు ఉదయం 9:30 గంటల నుండి ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగాయని, జిల్లావ్యాప్తంగా 12,269 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 99% హాజరు నమోదు అయిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలకు విద్యార్థులందరూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారని, తొలి రోజు విద్యార్థులందరూ ప్రశాంతంగా పరీక్షలు రాశారని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులు ఒత్తిడికి గురు కాకుండా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పరీక్ష కేంద్ర సిబ్బంది , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లోకో పైలట్లు కూల్‌డ్రింక్స్ తాగవచ్చా?.. రైల్వేశాఖ ఏమన్నదంటే!

లోకో పైలట్లు విధుల్లోకి వచ్చే ముందు శీతల పానీయాలు, దగ్గుమందు, కొబ్బరి నీళ్లు తాగవద్దంటూ దక్షిణ రైల్వే ఆదేశాలు ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ప్రభుత్వం స్పందించింది. లోకో పైలట్లు ఆల్కహాల్ లేని శీతల పానీయాలు తాగడంపై ఎటువంటి ఆంక్షలు లేవని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రైలు డ్రైవర్లు డ్యూటీకి వచ్చే సమయంలో, డ్యూటీలో ఉన్నప్పుడు శీతలపానీయాలు, కొన్నిరకాల పండ్లు, దగ్గుమందు, కొబ్బరినీళ్లు తాగవద్దని దక్షిణ రైల్వే ఏమైనా ఆదేశాలు ఇచ్చిందా? అని ఎండీఎంకే ఎంపీ వైకో, డీఎంకే సభ్యుడు ఎం షణ్ముగంలు రాజ్యసభలో ప్రశ్నించారు. వేసవిలో ఇంజిన్ మరింత వేడెక్కడంతో డ్రైవర్లకు చాలా దప్పిక వేస్తుందని, అటువంటి పరిస్థితుల్లో నిబంధనలు విధించడం అమానవీయమని అన్నారు. దీనిపై రైల్వే మంత్రి స్పందిస్తూ.. వీటిని తీసుకోవడంపై ఎటువంటి ఆంక్షలు లేవని, దక్షిణ రైల్వే ఇచ్చిన ఆదేశాలను ఇప్పటికే సవరించినట్లు చెప్పారు. డ్యూటీకి




వచ్చే లోకో పైలట్లకు చేస్తున్న శ్వాస పరీక్షలో ఎక్కువ మంది మద్యం సేవిస్తున్నట్లు ఫలితాలు రావడం రైల్వేశాఖను కలవరపాటుకు గురిచేసింది. అయితే, తదనంతరం వారికి నిర్వహించిన రక్త పరీక్షల్లో ఆల్కహాల్ శాతం సున్నాగా నిర్ధరణ అయ్యింది. అయితే, శీతల పానీయాలు, దగ్గుమందు, నోటి శుభ్రత స్ప్రేలు ఉపయోగిస్తున్నామని అనేక మంది చెప్పడంతో ఆ ఫలితాలకు అవే కారణమై ఉండవచ్చనే భావించారు. ఈ క్రమంలోనే కొన్ని రకాల పానీయాల వినియోగంపై దక్షిణ రైల్వేలోని తిరువనంతపురం డివిజన్ సర్క్యులర్ ఇవ్వడం వివాదాస్పదమైంది. దీనిపై లోకో పైలట్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో చివరకు దాన్ని ఉపసంహరించుకుంది.

## అమెరికా నుంచి అక్రమ వలసదారుల రాక.. త్వరలో మరో 295 మంది స్వదేశానికి..

డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కు పాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. దీంతో విడతల వారీగా పలువురు స్వదేశానికి తిరిగొచ్చారు. త్వరలో మరో 295 మంది భారతీయులను వెనక్కి పంపిస్తున్నట్లు కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అక్రమ వలసల అంశంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. ఈ సందర్భంగా భారత్‌కు పంపించిన వలసదారుల పట్ల అమెరికా అధికారులు వ్యవహరించిన తీరుపైనా కేంద్రం స్పందించింది. దీనిపై తమ ఆందోళనను అగ్రరాజ్యానికి తెలియజేసినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 5న భారత్‌కు పంపించిన అక్రమ వలసదారులకు, ముఖ్యంగా మహిళలకు సంకెళ్లు వేసిన అంశాన్ని అమెరికా వద్ద లేవనెత్తినట్లు తెలిపింది. దీనికి అగ్రరాజ్యం కూడా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించింది. ''భారత్ ఆందోళనల తర్వాత ఫిబ్రవరి 15, 16తేదీల్లో పంపించిన వలసదారుల్లో మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదని అమెరికా ధ్రువీకరించింది. వలసదారులు స్వదేశానికి చేరుకున్న తర్వాత వారితో చర్చించి మన అధికారులు కూడా దీన్ని నిర్ధారించుకున్నారు. ఇక, అమెరికాలో చట్టవ్యతిరేకంగా నివాసం ఉంటున్న



వారిలో మరో 295 మంది భారతీయులు త్వరలోనే స్వదేశానికి రానున్నారు. ప్రస్తుతం సంబంధిత ఏజెన్సీలు వారి వివరాలను పరిశీలిస్తున్నాయి'' అని విదేశాంగశాఖ తమ సమాధానంలో పేర్కొంది. ఫిబ్రవరి 5 నుంచి ఇప్పటివరకూ 388 మంది భారత అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో అగ్రరాజ్యం వెనక్కి పంపింది. వీరిలో అత్యధికంగా 40శాతం మంది పంజాబ్ వాసులు కాగా.. 34శాతం హరియాణాకు చెందిన వారు ఉన్నారు. అయితే, వీరి చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులతో బంధించి పంపడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై కేంద్రం కూడా స్పందించింది. మరోవైపు, ఈ డిపోర్టేషన్ ప్రక్రియ కొన్నేళ్ల నుంచి సాగుతోందని ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. 2009 నుంచి 2024 వరకు దాదాపు 15,500 మందిని అమెరికా వెనక్కి పంపించినట్లు గుర్తుచేసింది.

## అవినీతిని దాచేందుకే భాషా వివాదం..
### విపక్షాలపై విరుచుపడిన అమిత్‌షా

దిల్లీ: రాజకీయంగా లబ్ధి పొందేందుకు, అవినీతిని దాచి పెట్టేందుకే కొన్ని పార్టీలు భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా దుయ్యబట్టారు. భాష పేరిట ఇప్పటికే దేశంలో చాలా వరకు విభజన వచ్చిందని, ఇకపై ఎంతమాత్రం జరగబోదని వ్యాఖ్యానించారు. హిందీ ఏ భాషకూ పోటీ కాదని, అన్ని భాషలకూ సోదర భాష అని పేర్కొనారు. ఈ మేరకు రాజ్యసభలో ఆయన వివిధ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జాతీయ విద్యావిధానం, త్రిభాష అంశంపై వివాదం నెలకొన్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''కొన్ని పార్టీలు తమ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయి. వారి అవినీతిని దాచుకునే ప్రయత్నిస్తున్నాయి. దేశంలోని అన్ని భాషలూ దేశానికి ఓ నిధి లాంటిది. హిందీ కూడా ఇతర భాషలకు



సోదర భాషే'' అని అమిత్ షా అన్నారు. భాష పేరిట విభజన తీసుకొచ్చేందుకు చేపట్టే చర్యలేవీ ఫలించవన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యభాషా విభాగాన్ని ఏర్పాటు చేసిందని చేశారు. తెలుగు, తమిళం, పంజాబీ, అస్సామీ.. ఇలా అన్ని భాషలనూ ప్రాచుర్యం కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమని వివరించారు. దక్షిణాది భాషలకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అమిత్‌షా మండిపడ్డారు. అలాగైతే తాను గుజరాత్ నుంచి, నిర్మలా సీతారామన్ తమిళనాడు నుంచి ప్రభుత్వంలో మంత్రులుగా ఎలా వ్యవహరిస్తున్నామని ప్రశ్నించారు. ''ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో అందించాలని తమిళనాడు ప్రభుత్వానికి గత రెండేళ్లుగా కోరుతున్నా. దానివల్ల మీ (డీఎంకేని ఉద్దేశిస్తూ) ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవని భయపడుతున్నారు. మేం అధికారంలోకి వస్తే మెడికల్, ఇంజినీరింగ్ విద్యను తమిళ భాషలోనే అందిస్తాం'' అని అమిత్‌షా అన్నారు. తమిళనాడు అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి.

## అత్యాచార ఘటనపై అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు.. ఖండించిన కేంద్రమంత్రి

దిల్లీ: అత్యాచార కేసు విచారణ సందర్భంగా ఇటీవల అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. మహిళ ఛాతీని తాకడం అత్యాచారం కిందకు రాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ తీర్పు సమ్మతం కాదని పేర్కొన్నారు. దానిని పరిశీలించాలని సుప్రీంకోర్టును కోరారు. ఇలాంటి తీర్పులతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందన్నారు.

**అసలేం జరిగిందంటే..?**

2021 నవంబరు నాటి లైంగిక వేధింపుల కేసు ఇది. ఉత్తరప్రదేశ్‌లోని కసగంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన 11 ఏళ్ల (ఘటన జరిగే నాటికి) కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగివస్తుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వారిని సమీపించారు. బాలికను ఇంటి దగ్గర దింపుతామని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో ఆ యువకులు అమ్మాయిపై అత్యాచారానికి యత్నించారు. ఆమెను అసభ్యంగా తాకుతూ వేధింపులకు గురిచేశారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్న వారు రావడంతో నిందితులు అక్కడి



నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసు అలహాబాద్ హైకోర్టుకు చేరింది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. మహిళ ఛాతీని తాకినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ నిందితులకు అనుకూలంగా తీర్పు వెలువరించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి స్పందించారు.

## హనీట్రాప్ రగడ.. 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు

కర్ణాటకలో మంత్రులు సహా అనేక మంది ముఖ్యనేతలే లక్ష్యంగా కొనసాగుతోన్న 'హనీ ట్రాప్' వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. దీనిపై శుక్రవారం కర్ణాటక అసెంబ్లీ దద్దరిల్లింది. సమావేశాల వేళ ప్రతిపక్ష భాజపా నేతలు ఈ అంశాన్ని లేవనెత్తడంతో తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. దాంతో సభా కార్యక్రమాలకు అడ్డుపడిన 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూ తీర్మానం చేశారు. ఆరు నెలల పాటు వారిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. సంచలనంగా మారిన 'హనీ ట్రాప్' వ్యవహారాన్ని ఈ రోజు భాజపా నేతలు లేవనెత్తారు. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని వారు డిమాండ్



చేశారు. హనీ ట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును పాస్ చేయడాన్ని విమర్శిస్తూ.. స్పీకర్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. భాజపా నేతల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకసారి కేసు నమోదై.. దర్యాప్తు ప్రారంభమైతే హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన అనేకమంది రాజకీయ నేతలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న ఇటీవల అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అధికారపక్షం సహా విపక్షానికి చెందినవారు ఈ బాధితుల్లో ఉన్నారన్నారు. అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు.

## అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నాం ..ట్రంప్ ప్రతీకార సుంకాలపై భారత్



దిల్లీ: భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుంకాలు సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని భారత్ పేర్కొంది. ఇరువురికీ ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం కోసం ఓ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపింది. ట్రంప్ సుంకాల విధింపునకు మరో 11 రోజులే గడువున్న నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ ఈ విధంగా స్పందించింది. ''పరస్పరం ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా యంత్రాంగంతో వివిధ స్థాయిల్లో సంప్రదింపులు జరుపుతున్నాం. వీటిని ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో ఇరు దేశాలు నిమగ్నమై ఉన్నాయి. ద్వైపాక్షిక ఒప్పందానికి అవసరమైన ఫ్రేమ్‌వర్క్ రూపొందించడంపై రెండు ప్రభుత్వాలు చురుకుగా పని చేస్తున్నాయి. వాణిజ్యాన్ని విస్తరించడం, మార్కెట్ యాక్సెస్, సుంకాల తగ్గింపు, సప్లైచైన్ సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇవి కొనసాగుతున్నాయి'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.



# అతిలోక సుందరి.. శ్రీదేవి కూతురు ఫిట్‌నెస్ సీక్రెట్ ఇదే..!

**దివంగత టాలీవుడ్ నటి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ అచ్చం తల్లిలానే తన అందం అభినయంతో వేలాదిగా అభిమానులను సంపాదించుకుంది. అలనాటి అందాల తార శ్రీదేవిని తలపించేలా ముగ్ధమనోహరంగా ఉంటుంది. దేవర మూవీలో టాలీవుడ్ హీరో ఎన్‌టీఆర్ సరసన నటించి నటనలో మంచి మార్కులు కొట్టేసింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులు బ్రేక్ చేసేలా కలెక్షన్ల వర్షం కురిపించింది. ప్రస్తుతం అటు టాలీవుడ్, ఇటు బాలీవుడ్ వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఈ రోజు ఆమె పుట్టినరోజు. ఈ ఏడాది మార్చి 06తో 28 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఆమె గ్లామర్ పరంగా తన తల్లికి ఏమాత్రం తీసిపోని విధంగా ఫిట్‌గా స్లిమ్‌గా ఉంటుంది. మరో అతిలోక సందరిలా కళ్లు తిప్పకోనివ్వని అందం ఆమె**

జాన్వీ తరుచుగా తన ఫిట్‌నెస్‌కి సంబంధించిన వీడియోలను షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తుంటుంది. ఆమె ఒక ఇంటర్వ్యూలో బ్యూటీ సీక్రెట్ ని బయటపెట్టింది. తన ఆహారపు అలవాట్లు, ఫిటెనెస్ సీక్రెట్ తదితరాల గురించి షేర్ చేసుకుంది. తాను ఎక్కువగా ఇంట్లో వండిన ఆహారాలనే ఇష్టంగా తింటానని అంటోంది. కఠినమైన డైట్‌ని ఫాలోఅవుతానని అంటోంది. అల్పాహారం అవకాడో, రెండు గుడ్లు మాత్రమేనని, భోజనంలో గ్రిల్డ్ చికెన్, పాలకూర, సూప్ తీసుకుంటానని చెబుతోంది.

ఎక్కువగా జపనీస్, ఇటాలియన్, ఆంధ్ర, మొఘలాయ్ వంటకాలంటే ఇష్టమని చెప్పుకొచ్చింది. అయితే తాను గ్లూటైన్ రహిత ఫుడ్‌నే తీసుకుంటానంటోంది. ఎందుకంటే గ్లూటైన్ తనకు పడదని, అలెర్జీ వస్తుందని తెలిపింది. తనకు బాగా నచ్చిన ఆరోగ్యకరమైన మంచీలను లేదా పండ్లు ఎక్కువగా ఇష్టంగా తింటానని చెప్పింది. వాటిలో చక్కెర ఎలాగో ఎక్కువ ఉంటుంది కాబట్టి స్వీట్స్ జోలికి వెళ్లనంటోంది. బాగా, పానీపూరీ, ఐస్‌క్రీం, స్ట్రాబెర్రీలు అంటే మహా ఇష్టమని చెబుతోంది.



చాలామటుకు అన్ని కూరగాయలు, పళ్లు తింటానని, కాకపోతే బరువు పెరగకుండా చూసుకునేందుకు ఎక్కువగా వ్యాయామాలు చేస్తానని చెప్పింది. తేలికగా జీర్ణమయ్యే ఆహారానికే ప్రాధాన్యత ఇస్తుందట. అందుకే ఎక్కువగా రెడ్‌రైస్ బిర్యానీనే తింటుందట. తన చివరి భోజనం తొందరగానే పూర్తి చేస్తానని ఒకవేళ షూటింగ్ ఉంటే 10 గంటల కల్లా పూర్తి చేస్తానని చెబుతోంది.

ఇంతకుమునుపు చిలగడదుంప, పరాఠా వద్దకు వెళ్లేదాన్నికాదని, నో కార్బ్ హైడ్రేట్‌ను పాటించేదాన్ని అని తెలిపింది. అయితే ఇప్పుడు కార్బోహైడ్రేట్లు పెంచడం ప్రారంభించినట్లు వెల్లడించింది జాన్వీ కపూర్. గ్లామర్ ఫీల్డ్‌లో రాణించాలంటే ఆ మాత్రం కేర్ తీసుకోకపోతే కష్టమే కదూ..!.



# బీట్‌రూట్‌ని మజ్జిగతో కలిపి ఎందుకు తీసుకోవాలంటే..!

మాములుగా బీట్‌రూట్‌తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయన్న సంగతి తెలిసిందే. దీన్ని జ్యూస్ రూపంలో లేదా కూర రూపంలో తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. అయితే కొన్నింటిని కొన్ని రకాల ఆహారాలతో జత చేసి తీసుకుంటే మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చు. అదెలాగో చూద్దామా..!.



బీట్‌రూట్ ఐరన్, యాంటీ ఆక్సిడెంట్ల మూలం. దీన్ని మజ్జిగతో జత చేసి తీసుకుంటే శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ శోషణ పెరుగుతుందని చెబుతున్నారు న్యూట్రీషన్లు. ఇలా తీసుకుంటే ఐరన్ శోషణ తోపాటు, గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందట. చలవ చేయడమే గాక మొత్తం ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని చెబుతున్నారు.

బీట్‌రూట్‌లో ఉండే కొన్ని రకాల ఐరన్‌లను మన శరీరం గ్రహించలేదు. అదే దాన్ని మజ్జిగతో కలిపి తీసుకున్నట్లయితే.. అందులో ఉండే లాక్టిక్ ఆమ్లం మంచి ప్రోబయోటిక్‌లను అందిస్తుంది. మంచి గట్ ఆరోగ్యాన్ని అందిస్తుంది. అంతేగాదు ఇందులోని ఆమ్లత్వం పేగులోని ఐరన్ శోషణను మరింత పెంచుతుంది. ఎర్రరక్తకణాలు ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. అలాగే రక్తహీనతను కూడా నివారిస్తుంది.

దీనిలో నైట్రిక్ ఆక్సైడ్‌లుగా మార్చే నైట్రేట్లు ఉంటాయి. రక్తనాళాల్లో బ్లాక్‌లు ఉండవని చెబుతున్నారు నిపుణులు. ఇది హృదయనాళ పనితీరుకి మద్దతిచ్చే బయోయాక్టివ్ పెప్టైడ్‌లను అందిస్తుంది.

వీటన్నింటి తోపాటు కాలేయ పనితీరుకి కూడా సహాయపడుతుంది. శరీరంలోని టాక్సిన్‌లను తొలగిస్తుంది. ఇలా బీట్‌రూట్ బట్టర్‌మిల్క్ మిక్సింగ్ అనేది శక్తిమంతమైన రిఫ్రెష్ టానిక్‌లా పనిచేస్తుంది.



# నా ఇన్‌స్పిరేషన్ మా అమ్మ'..!: సొనాలీ బెంద్రే

**ప్రతి ఆడపిల్ల ఫైనాన్షియల్‌గా స్ట్రాంగ్‌గా ఉండాలి. అప్పడే మనం ఏం చెప్పిన నెగ్గుతుంది. ఎంతటి ధనవంతుడిని పెళ్లి చేసుకున్న ధైర్యంగా ఉండలేం. ఆర్థికంగా బాగుంటేనే స్థైర్యం దాతనంతటే అదే తన్నుకుంటూ వస్తుంది. ఆ విషయంలో నాకు మా అమ్మే స్ఫూర్తి అంటోంది బాలీవుడ్ నటి సొనాలీ బెంద్రే. అదెలాగో ఆమె మాటల్లో చూద్దామా..!.**



ఎలాగంటే...'మేము ముగ్గురం అక్కచెల్లెళ్లం. ఆడపిల్లలకు చదువు, ఆర్థిక స్వాతంత్ర్యం చాలా ముఖ్యమని నమ్ముతుంది మా అమ్మ (పేరు.. రూపీ బెంద్రే). నేను మోడలింగ్ ట్రయల్స్‌లో ఉన్న రోజుల్లో ఒకసారి.. నన్ను, నా సిస్టర్స్‌ని కూర్చోబెట్టుకుని 'మీరు ఎంత సంపన్నులను తీసుకొచ్చి నా ముందు నిలబెట్టి పెళ్లి చేసుకోబోతున్నామని చెప్పినా నేను పర్మిషన్ ఇవ్వను. మీ కాళ్ల మీద మీరు నిలబడి.. ఫైనాన్షియల్‌గా స్ట్రాంగ్ అయ్యాకే.. పెళ్లి! ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే మీకు వాయిస్ ఉంటుంది.. గుర్తుపెట్టుకోండి' అని చెప్పింది. ఆ మాట మంత్రంలా పనిచేసింది మాకు. కెరీర్‌లో ఎదగడానికి స్ఫూర్తినిచ్చింది. నేనీ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే స్ఫూర్తి అమ్మే! నిజంగానే ఆడపిల్లకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి. దాని వల్ల ఒక భరోసా వస్తుంది. ఆ భరోసా మనల్ని స్ట్రాంగ్‌గా నిలబెడుతుంది!'.



## వరుసగా ఐదో రోజూ లాభాలే..
## 77 వేలు దాటిన సెన్సెక్స్..




**ముంబై:** భారీ నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు రికవరీ బాట పట్టాయి. ఇటీవల వరుస నష్టాలతో కునారిల్లిన దేశీయ సూచీలు లాభాలను ఆర్జిస్తున్నాయి. వరుసగా ఐదో రోజు కూడా లాభాలతోనే ముగిశాయి. ఆకర్షణీయంగా ఉన్న హెవీ వెయిట్ షేర్లతో పాటు మిడ్, స్మాల్ క్యాప్ విభాగాల్లో కొనుగోళ్లు మార్కెట్లను పరుగులు తీయిస్తున్నాయి. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ, చాలా స్టాక్స్ ఆకర్షణీయంగా ఉండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో పయనించాయి.

గురువారం ముగింపు (76, 348)తో పోల్చుకుంటే శుక్రవారం ఉదయం 200 పాయింట్ల నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల బాట పట్టింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా ఎనర్జీ, ఫైనాన్సియల్, ఆటో స్టాక్స్ బాగా లాభపడ్డాయి. దీంతో సెన్సెక్స్ చాలా రోజుల తర్వాత 77 వేలను కూడా దాటింది. చివరకు సెన్సెక్స్ 557 పాయింట్ల లాభంతో 76, 905 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 159 పాయింట్ల లాభంతో 23, 350 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్‌లో మనప్పురం ఫైనాన్స్, బీఎస్ఈ లిమిటెడ్, హింద్ పెట్రో, టిటాగర్ షేర్లు లాభాలను ఆర్జించాయి. జిందాల్ స్టెయిన్‌లెస్, వోల్టాస్, నాల్కో, సీజీ పవర్ షేర్లు నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 706 పాయింట్లు ఎగబాకింది. బ్యాంక్ నిఫ్టీ 530 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.97 గా ఉంది.

## తస్సాదియ్యా 'టెస్సారెక్ట్'..
### సింగిల్ చార్జ్ పై 261కి.మీ.
### కొత్త ట్రెండ్ సెట్ చేస్తోందిగా..!



**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ స్కూటర్లకు మన దేశీయ మార్కెట్లో డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా సంప్రదాయ పెట్రోల్ ఇంజిన్ లతో పోల్చితే అత్యాధునిక సాంకేతికత సాయంతో, అదనపు ఫీచర్లను జోడించి ఎలక్ట్రిక్ స్కూటర్లను డిజైన్ చేసి మార్కెట్లోకి తీసుకొస్తుండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు క్యూ కడుతున్నారు. ఇందుకు నిదర్శనం ఇటీవల లాంచ్ అయిన ఓ హైపర్ మోడర్న్ ఎలక్ట్రిక్ స్కూటర్. అల్ట్రావయోలెట్ కంపెనీ నుంచి వచ్చిన టెస్సారెక్ట్ అనే ఎలక్ట్రిక్ స్కూటర్ ప్రీ బుకింగ్స్ లో కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ స్కూటర్ ను పరిచయం చేసిన రెండు వారాల సమయంలో ఏకంగా 50,000 యూనిట్లు బుక్ అవడం కొత్త రికార్డని పరిశీలకులు చెబుతున్నారు. మన దేశీయ మార్కెట్లో టాప్ టెక్ ఫీచర్లు కలిగిన ఎలక్ట్రిక్ స్కూటర్లకు ఉన్న డిమాండ్ తెలియజేస్తుంది.

#### అల్ట్రావయోలెట్ టెస్సారెక్ట్ ప్రారంభ ఆఫర్..

అల్ట్రావయోలెట్ టెస్సారెక్ట్ ఈ నెలలోనే మన దేశంలో లాంచ్ అయ్యింది. ఈ స్కూటర్ ప్రారంభ ఆఫర్ గా మొదటి 10,000 కస్టమర్లకు ఈ స్కూటర్ ను రూ. 1.20లక్షలకే అందిస్తామని పేర్కొంది. దీంతో బజ్ క్రియేటైంది. దీంతో కేవలం 48 గంటల్లోనే 20,000 బుకింగ్స్ సాధించింది. దీంతో కంపెనీ ఈ ప్రారంభ ఆఫర్ ను మొదటి 50,000 కస్టమర్లకు ఇదే ధరకు అందిస్తామని పేర్కొన్నారు.

#### సింగిల్ చార్జ్ పై 261 కిలోమీటర్లు..

టెస్సారెక్ట్ స్కూటర్ కు అల్ట్రావయోలెట్ మూడు బ్యాటరీ ఆప్షన్లను అందిస్తోంది. అందులో చిన్న ప్యాక్ 3.5కేడబ్ల్యూహెచ్ యూనిట్. ఇది సింగిల్ చార్జ్ పై 162 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. తర్వాత యూనిట్ 5కేడబ్ల్యూహెచ్ ఉంటుంది. దీని రేంజ్ 220కిలోమీటర్లు. టాప్ ఎండ్ వేరియంట్ 6కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ తో వస్తుంది. దీని రేంజ్ ఏకంగా 261కిలోమీటర్లు ఉంటుంది.

#### టెస్సారెక్ట్ ఫీచర్లు..

ఈ స్కూటర్లో అడ్వాన్స్‌డ్ ఫీచర్లు ఉన్నాయి. ముఖ్యంగా రైడర్ కు అదనపు వెసులుబాటు కల్పిస్తూ, సేఫ్టీకి అధిక ప్రాధన్యం ఇస్తోంది. ఇంటిగ్రేటెడ్ రాడార్, బ్లైండ్ స్పాట్ డిటెక్షన్, ఓవర్ టేకింగ్ అసిస్ట్, లేన్ చేంజ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. అంతేకాక ఈ స్కూటర్లో రియల్ టైం కొలిషన్ అలర్ట్ కూడా ఉంటుంది. ఇది బండి క్రాష్ అవడాన్ని నిరోధించేందుకు ఉపయోగ పడుతుంది. అంతేకాక దీనిలో ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా బ్యాటరీ రీ చార్జ్ అవుతుంది.

#### ధర, డెలివరీలు..

ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ. 1.20లక్షలు(ఎక్స్ షోరూం)గా ఉన్నప్పటికీ అసలు ధర రూ. 1.45లక్షలు. కాగా దీనిని మీరు బుక్ చేసుకోవాలనుకుంటే రూ. 999 టోకెన్ అమౌంట్ చెల్లించి ప్రీ బుక్ చేసుకోవచ్చు. ఈ స్కూటర్ డెలివరీలు వచ్చే ఏడాది నుంచి ప్రారంభవుతాయని కంపెనీ పేర్కొంది.

## పసిడి ప్రియులకు షాక్..



**న్యూఢిల్లీ:** బంగారం ధర శుక్రవారం స్వల్పంగా పెరిగింది. గోల్డ్ ధరలు ప్రపంచ బంగారం ధరలపై ఆధారపడి ఉంటాయి, ద్రవ్యోల్బణం, ప్రపంచ ధరలలో మార్పు, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, ఆభరణాల మార్కెట్లు వంటి అనేక అంతర్జాతీయ అంశాల ద్వారా ఇవి ప్రభావితమవుతాయి. గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. గతేడాదితో పోలిస్తే భారీగానే పెరుగుతూ వస్తోంది. అయితే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి పగ్గాలు చేపట్టిన తర్వాత పసిడి ధర పెరిగింది. ఆయన తీసుకుంటున్న వరస సంచలన నిర్ణయాలతో అంతర్జాతీయ మార్కెట్లు బెంబేలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మదుపరులంతా గోల్డ్‌ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దిగుమతి సుంకాలను ట్రంప్ భారీగా పెంచారు. దీంతో పెట్టుబడుదారులంతా ఒక్కసారిగా పసిడి వైపు మ్నొగ్గు చూపడంతో గోల్డ్ ధర రోజు రోజుకు పెరుగుతోంది.

హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం గ్రాముకు రూపాయి పెరిగి 10 గ్రాముల ధర రూ. 83,110గా ఉంది. అలాగే 24 క్యారెట్ల బంగారం గ్రాముకు రూపాయి పెరిగి 10 గ్రాముల ధర రూ. 90,670గా ఉంది.

# ఘనంగా జరగనున్న ఐపీఎల్ ప్రారంభోత్సవం

### సందడి చేయనున్న బాలీవుడ్ స్టార్లు, సింగర్స్!
### శ్రేయా ఘోషల్, దిశా పటానీ పాల్గొనే ఛాన్స్
### కోల్‌కతాలో భారీ వర్షాలు
### ఐపీఎల్ ఫస్ట్ మ్యాచ్ రద్దయ్యే అవకాశం
### ఆరెంజ్ అలెర్ట్ ఇష్యూ చేసిన వాతావరణ శాఖ



**కోల్‌కతా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ ఎడిషన్ మార్చి 22న ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు ఐపీఎల్ ప్రారంభోత్సవాన్ని బీసీసీఐ గ్రాండ్‌గా నిర్వహించనుంది. ఈ ఓపెనింగ్ సెర్మనీలో పలువురు బాలీవుడ్ స్టార్స్ సందడి చేయనున్నారు. అలాగే సింగర్స్ తమ గాత్రంతో ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.ప్రముఖ రాపర్ కరణ్ ఆజ్లా ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఓపెనింగ్ సెర్మనీలో సందడి చేయనున్నారని బుధవారమే ( మార్చి 19న) తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఐపీఎల్ పోస్ట్ చేసింది. ఈ క్రమంలో పోస్టర్‌ను సైతం షేర్ చేసింది. "గొప్ప వైబ్ చెక్ కోసం సిద్ధంగా ఉ ఒడండి" అని పోస్ట్‌కు క్యాప్షన్ కూడా ఇచ్చింది. ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్, బాలీవుడ్ నటి దిశా పటానీ కూడా ఐపీఎల్‌లో సందడి చేయనున్నారు. ఈ మేరకు ఇటీవలే ఐపీఎల్ తన ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసింది. శ్రేయా ఘోషల్ ట్యూన్‌లను ఆస్వాదించడానికి సిద్ధమవ్వండని పేర్కొంది. "టాటా ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభోత్సవంలో శ్రేయా ఘోషల్ వేదికపైకి వచ్చినప్పుడు, ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా సింఫొనీ కోసం మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి!" అని పోస్ట్‌లో రాసుకొచ్చింది.బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దిశా పటానీ కూడా ఐపీఎల్ ఓపెనింగ్ సెర్మనీలో సందడి చేయనున్నారు. ఈ విషయాన్ని ఐపీఎల్ తన ఎక్స్ హ్యాండిల్ ద్వారా ధ్రువీకరిస్తూ పోస్ట్ చేసింది. 'ఐపీఎల్ 18వ ఎడిషన్‌ను గత సీజన్ కంటే గ్రాండ్‌గా జరుపుకోవాలి. వేదికను ఊపేయడానికి దిశా పటానీ కంటే మంచి వ్యక్తి ఎవరు? టాటా ఐపీఎల్ 18 ప్రారంభోత్సవ వేడుకను మిస్ అవ్వకండి.' అని రాసుకొచ్చింది.

#### కోలకతాలో భారీ వర్షాలు

ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా ఐపీఎల్ 2025 తొలి మ్యాచే జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈనెల 22న కోల్ కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఐపీఎల్ ఆరంభ మ్యాచ్ జరిగబోదని తెలుస్తోంది. గురువారం నుంచి ఆదివారం వరకు భారీ వర్షాలు, పిడుగులతో కూడిన వర్షాలు పడనున్న నేపథ్యంలో శనివారం ఈ మ్యాచ్ జరిగే అవకాశాలు లేవని తెలుస్తోంది. మ్యాచ్ రోజు సాయంత్రం.. దాదాపు 90 శాతం భారీ వర్షం పడే అవకాశమున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆరెంజ్ అలెర్ట్ ఇష్యూ చేసిన వాతావరణ శాఖ, దాన్ని యెల్లో అలెర్టు కు మార్చనుంది. ఇక ఇరుజట్ల మధ్య కనీసం ఫలితం తేలేంత సమయం కూడా మ్యాచ్ జరిగే అవకాశం లేదని సమాచారం. గత సీజన్ లో విజేతగా నిలిచిన కోల్ కతా నైట్ రైడర్స్ డిఫెండింగ్ చాంపియన్ గా బరిలోకి దిగుతోంది. సొంతగడ్డ ఈడెన్ గార్డెన్స్ లో జరిగే తొలి మ్యాచే రద్దు కానుడటంపై ఆ జట్టులో కాస్త ఆందోళన నెలకొంది. అయితే ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్ కావడంతో అందరి దృష్టి ఈ మ్యాచ్ పైనే నెలకొంది. ఇప్పటికే ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు చేశారు. సింగర్ శ్రేయా ఘోషల్, నటి దిశా పటానీ, పాట, ఆటలతో అభిమానులను ఉ ర్రుతలూగించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ ఏర్పాట్లపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇక మెగాటోర్నీలో మూడో టైటిల్ సాధించిన కోల్ కతా .. సొంతగడ్డపై శనివారం జరిగే మ్యాచ్ లో శుభారంభం చేయాలని భావించింది. అయితే వరుణుడు మాత్రం మ్యాచ్ కు అడ్డంకిగా మారే అవకాశముందని తెలుస్తోంది. మరోవైపు మూడుసార్లు రన్నరప్ ఆర్సీబీ కూడా ఈ మ్యాచ్ పై ఆశలు పెట్టుకుంది. తొలి మ్యాచ్ లో గెలిచి సత్తా చాటాలని ప్రణాళికలు రచిస్తోంది. అయితే తాజాగా రద్దు మాట వినిపస్తుండటంతో ఆ జట్టులోనూ గుబులు నెలకొంది. ఇక ఐపీఎల్లో కోల్ కతాకు కలిసి రావడం లేదు. తొలి మ్యాచ్ కు వరణుడి గండం ఉండటంతో వచ్చేనెల 6న జరిగే మ్యాచ్ కు వేరే స్టేట్ కు షిఫ్ట్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో కోల్ కతా ఈ మ్యాచ్ ఆడాల్సి ఉ ంది. అయితే ఏప్రిల్ 6న శ్రీరామనవమి ఉండటంతో మ్యాచ్ నిర్వహణ భద్రతా ఏర్పాట్లు తమ వల్ల కావని బెంగాల్ పోలీసులు చేతులెత్తేశారు. దీనిపై సమీక్షించిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు స్నేహాశీష్ గంగూలీ.. మ్యాచ్ ను అసోంలోని గువాహటికి తరలించే అవకాశమున్నట్లు పేర్కొన్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో మ్యాచ్ ను రీ షెడ్యూల్ చేసే అవకాశం లేదని, అందుచేత మ్యాచ్ ను తరలించనున్నట్లు తెలిపారు. నవమి రోజున బెంగాల్లో దాదాపు 20వేలకు పైగా ఊరేగింపులు జరుగుతాయని, ముందస్తుగా బీజేపీ నాయకుదు సువేందు అధికారి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ రోజు మ్యాచ్ భద్రతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. గతేదాది కూడా ఇలాంటి సమస్యే ఎదురైతే మ్యాచ్ రీ షెడ్యూల్ చేశారు. కానీ ఈసారి మ్యాచ్ ను షిఫ్ట్ చేయడానికే మొగ్గు చూపుతున్నారు.

## మరో కొత్త అవతారమెత్తనున్న కేన్ మామ



### కామెంటేటర్‌గా సందడి చేసే అవకాశం

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అనగానే వార్నర్ తో పాటు టక్కున గుర్తొచ్చే పేరు కేన్ విలియమ్సన్. అయితే విలియమ్సన్.. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో తెలుగు క్రికెట్ అభిమానులంతా నిరాశ వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు అతడు అన్ సోల్డ్‌గా మిగిలిపోయినప్పటికీ.. 18వ సీజన్ లో సందడి చేసేందుకు సిద్ధం కానున్నాడు.అయితే ఈ సారి ఆటగాడిగా కాకుండా, కేన్ మామ మరో కొత్త అవతారమెత్తనున్నాడు. కామెంటేటర్ గా క్రికెట్ అభిమానులకు కనిపించనున్నాడు. ఈ విషయాన్ని బ్రాడ్ కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ అనౌన్స్ చేసింది. తాజాగా స్టార్ స్టడెడ్ కామెంటేటరీ ప్యానెల్ ను ప్రకటించింది స్టార్ స్పోర్ట్స్. ఇందులో కేన్ విలియమ్సన్ పేరు కూడా ఉండటం విశేషం. కాగా, కేన్ విలియమ్సన్.. రెండు సార్లు ఐపీఎల్ విన్నింగ్ టీమ్ లో భాగస్వామిగా ఉన్నాడు. 2016లో డేవిడ్ వార్నర్ నాయకత్వంలో గెలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఉండగా.. 2022లో ట్రోఫీని ముద్దాడిన గుజరాట్ టైటాన్స్ టీమ్ లో ఉన్నాడు. వీరేంద్ర సెహ్వాగ్, శిఖర్ ధావన్, హర్భజన్ సింగ్, అనిల్ కుంబ్లే, సురేశ్ రైనా, కేన్ విలియమ్సన్, ఏబీ డివిలియర్స్, ఆరోన్ ఫించ్, రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడు, మహ్మద్ కైఫ్, పీయూష్ చావ్లా, సునీల్ గావస్కర్, నవజ్యోత్ సింగ్ సిద్ధూ, ఆకాశ్ చోప్రా, సంజయ్ మంజ్రేకర్ చోప్రా, మైఖేల్ క్లార్కే, మ్యాథ్యూ హేడెన్, మార్క్ బౌచర్, ఆర్పీ సింగ్, షేన్ వాట్సన్, సంజయ్ బంగర్, వరుణ్ ఆరోన్, ప్రజ్ఞాన్ ఓజా, అజయ్ జడేజా.

## గుజరాత్ టైటాన్స్ కోసం టైటిల్ అందించడమే నా లక్ష్యం

### టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను రీసెంట్‌గా ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం ఎంపిక చేయలేదన్న సంగతి తెలిసిందే. అందుకు గల కారణాన్ని కూడా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. పాత బంతితో సిరాజ్ ఎక్కువ ప్రభావం చూపలేకపోతున్నాడని రోహిత్ అన్నాడు. తాజాగా ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఈ విషయంపై సిరాజ్ కాస్త ఘాటుగానే స్పందించాడు."నేను గతంలో పాత బంతితో అత్యధిక వికెట్లు తీశాను. ప్రపంచంలోని టాప్ 10 ఫాస్టెస్ట్ బౌలర్స్‌లో ఒకడిని. నా ఎకానమి రేట్ కూడా లోగా ఉంది. నా గణాంకాలే నా ప్రదర్శన ఎలా ఉందో చెబుతాయి. నేను కొత్త బంతితో, పాత బంతితో.. రెండితోనూ బాగా రాణించాను. ప్రస్తుతం నాకు దొరికిన సమయంలో ఫిట్‌నెస్‌తో పాటు బౌలింగ్‌పై పూర్తి దృష్టి సారించాను. కొత్త బాల్ తో పాటు పాత బంతితోనూ ప్రాక్టీసింగ్ చేస్తున్నాను. అలానే నెమ్మది బంతులు, యార్కర్స్‌పై కూడా దృష్టి సారించాను. ఐపీఎల్ లో బాగా రాణించి, గుజరాత్ టైటాన్స్ కోసం టైటిల్ అందించడమే నా లక్ష్యం." అని సిరాజ్ చెప్పుకొచ్చాడు.ప్రస్తుతం సిరాజ్ అన్న మాటలు చర్చనీయాంశంగా మారాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో తనను ఎంపిక చేయకపోవడంపై వచ్చిన ఫ్రస్టేషన్‌ను.. అతడు ఐపీఎల్‌లో ఏ విధంగా చూపించి రాణిస్తాడో అని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ఐపీఎల్ 2005 సీజన్ కోసం జరిగిన మెగా వేలంలో సిరాజ్‌ను ఆర్సీబీ విడిచిపెట్టింది. దీంతో గుజరాత్ టైటాన్స్ సిరాజ్ ను 12.25 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ జట్టులో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన రెండో ఆటగాడు సిరాజే కావడం విశేషం.

## బీసీసీఐ రూల్స్‌ను ఉల్లంఘించిన
# ఆర్సీబీ ఆటగాళ్లు



**బెంగళూరు:** క్రికెట్ అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న మెగా పండగ ఐపీఎల్ 2025 వచ్చేసింది. తొలి మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుండగా.. ఇప్పటికే ఆర్సీబీ వర్సెస్ కేకేఆర్ జట్లు మైదానానికి చేరుకుని ప్రాక్టీస్ సెషన్ ను మొదలు పెట్టేశాయి. అయితే ఈ మ్యాచ్‌కు ముందు ఇప్పుడు ఆర్సీబీ ప్లేయర్స్ చిక్కుల్లో పడే అవకాశం కనిపిస్తోంది. అందుకు కారణం బీసీసీఐ రూల్స్‌ను బెంగళూరు జట్టు ఆటగాళ్లు ఉల్లంఘించడమే.రీసెంట్‌గా బీసీసీఐ.. 10 పాయింట్లతో నియమావళిని రూపొందించి, ఆటగాళ్లు పాటించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి.. ఏ మ్యాచ్ కోసమైనా స్టేడియానికి జట్టు ఆటగాళ్లంతా ఒకే బస్సులో ప్రయాణించి, తిరిగి అదే బస్సులో అందరూ కలిసి వెళ్ళడం. ఎవరూ కూడా వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణించకూడదు. ఐపీఎల్ టీమ్ క్రికెటర్స్ కు కూడా ఇదే వర్తిస్తుందని సమాచారం. కానీ తాజాగా జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్ లో అలా జరగలేదు. ఈ ప్రాక్టీస్ మ్యాచ్ లో కోహ్లీని చూసేందుకు జనం ఎగబడ్డారు. దీంతో అతడు మ్యాచ్ అయ్యాక బయటకు వెళ్లేందుకు కష్టపడాల్సి వచ్చింది. ఓ దశలో అతడు టీమ్ బస్ కాకుండా, వ్యక్తిగత కారులో మైదానం వీడుతాడని కూడా వార్తలు వచ్చాయి. కానీ విరాట్ చివరికి జట్టుతోనే కలిసి బస్సులో ప్రయాణించాడు. ఆ సమయంలో తన అభిమానులకు ఆటోగ్రాఫ్ లు కూడా ఇచ్చాడు. అయితే ఆర్సీబీ ప్లేయర్స్ కృనాల్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, హెజిల్‌వుడ్ బీసీసీఐ రూల్స్ ను ఉల్లంఘించారని తెలిసింది. వాళ్లు తిరిగి బయలుదేరేటప్పుడు టీమ్ బస్సులో కాకుండా కారులో వెళ్లారట. ఇది కాస్త కెమెరా కంటికి చిక్కింది. దీంతో వీరిపై ఇప్పుడు బీసీసీఐ ఏమైనా చర్యలు తీసుకుంటుందా అని క్రికెట్ అభిమానుల మదిలో ప్రశ్నలు మెదులుతున్నాయి.




## సోషల్‌మీడియాలో ఫోటోలతో మేఘాఆకాశ్ హల్‌చల్

**టాకీస్:** టాలీవుడ్ హీరోయిన్ మేఘా ఆకాష్‌కు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. కొన్నాళ్లుగా సినిమాల్లో సైలెంట్ అయిన ఈ బ్యూటీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఏ అమ్మడి అందానికి కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. నితిన్ నటించిన లై సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది ఈ బ్యూటీ. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ కాగా.. అందం, అభినయంతో మంచి మార్కులు కొట్టేసింది మేఘా. మొదటి సినిమాతోనే తెలుగు అడియన్స్ కు దగ్గరైంది. కానీ ఆ తర్వాత కథానాయికగా అనుకున్నంతగా అవకాశాలు మాత్రం రాలేదు. ఈ మూవీ తర్వాత మరోసారి నితిన్ సరసన ఛల్ మోహన్ రంగ చిత్రంలో నటించినప్పటికీ ఈ మూవీ కూడా నిరాశపరిచింది. కానీ నటన పరంగా మేఘా ఆకట్టుకుంది. దీంతో ఈ అమ్మడుకు తెలుగులో ఆఫర్స్ రాకపోవడంతో కోలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. తమిళంలో వరుస సినిమాలు చేస్తూ అక్కడే టాప్ హీరోయిన్‌గా మారింది. అప్పుడప్పుడు తెలుగులో ఒకట్రెండు చిత్రాల్లో మెరిసింది. కొన్నాళ్లు గ్యాప్ తీసుకున్న మేఘా ఆకాష్ రాజా రాజ చోర.. డియర్ మేఘా, గుర్తుందా శీతాకాలం, ప్రేమదేశం, రావణాసుర, మనుచరిత్ర వంటి చిత్రాల్లో నటించింది. ఈ సినిమాలకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ మేఘాకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు. సోషల్ మీడియాలో నిత్యం ఏదోక ఫోటో షేర్ చేస్తూ ఫాలోవర్లకు టచ్‌లో ఉంటుంది.

## ఆ స్టార్ హీరో నాకన్నా చిన్నపిల్లాడిలా కనిపిస్తాడు

### జాన్వీకపూర్




**టాకీస్:** బాలీవుడ్ ముద్దగుమ్మ జాన్వీ కపూర్ హీరోయిన్ గా హిందీలో రాణిస్తుంది. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోతుంది ఈ చిన్నది. ఇక సోషల్ మీడియాలో జాన్వీ అందాలకు యమా క్రేజ్ ఉంది. అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ చిన్నది. ఇక ఈ బ్యూటీ దేవర సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో పాటు అందంతోనూ మెప్పించి మంచి మార్కులు కొట్టేసింది జాన్వీ. ఇక ఇప్పుడు ఈ అమ్మడు దేవర 2లో నటిస్తుంది. అలాగే రామ్ చరణ్ తోనూ నటిస్తుంది. ఇదిలా ఉంటే జాన్వీ కపూర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. జాన్వీ కపూర్ గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టాలీవుడ్ స్టార్ హీరో గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆయన వయసు రోజు రోజుకు తగ్గుతుంది అని చెప్పుకొచ్చింది. ఇంతకూ ఆ స్టార్ హీరో ఎవరో తెలుసా.? మీరు గెస్ చేసే ఉంటారు ఆయన ఎవరో కాదు సూపర్ స్టార్ మహేష్ బాబు. గతంలో ఓ ఇంటర్వ్యూలో మహేష్ గురించి జాన్వీ మాట్లాడింది. మహేష్ బాబు గురించి మాట్లాడుతూ.. ఆయనకు వయసు అవ్వదు. ఆయనకు రోజు రోజుకు వయసు తగ్గిపోతుంది. ఎంతో హ్యాండ్సమ్ గా ఉంటారు. కొన్నిసార్లు నా కన్నా చిన్నవాడిగా కనిపిస్తారు అని తెలిపింది జాన్వీ.

## సమంతకు ఓటీటీ అవార్డు



**టాకీస్:** టాలీవుడ్ స్టార్ నటి సమంతకు ఓటీటీ ఉత్తమ నటి అవార్డు దక్కింది. సామ్ నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్ : హనీ బన్నీ' లో ఉత్తమ నటన కనబరిచినందుకు ఓ మీడియా సంస్థ సమంతను ఈ పురస్కారంతో సత్కరించింది. దీన్ని గెలుచుకోవడంపై సామ్ సంతోషం వ్యక్తం చేసింది. ప్రతికూల పరిస్థితుల మధ్య ఈ సిరీస్‌ను పూర్తి చేయడమే తనకు ఒక అవార్డు అని పేర్కొంది. రాజ్ అండ్ డీకే, వరుణ్ ధావన్ వల్లే తాను ఈ సిరీస్‌ను విజయవంతంగా పూర్తి చేయగలిగినట్లు చెప్పుకొచ్చింది. ఈ సిరీస్‌ను కంప్లీట్ చేయడం కోసం వారు ఎంతో ఓపికతో వ్యవహరించారని, తనను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారని తెలిపింది.

## మత్తెక్కిస్తున్న వామికా గబ్బి




టాకీస్: సోషల్ మీడియాలో ఎవరు ఎప్పుడు ట్రెండ్ అవుతారో చెప్పలేం. అలా ఈ హాట్ బ్యూటీ ఇప్పుడు యమా ట్రెండింగ్ అవుతోంది. ఈ బ్యూటీ ఓరకంటతో చూస్తున్న ఫోటోలు నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది. ఇంతకీ ఆమె ఎవరా అని అనుకుంటున్నారా.! కేవలం ఒకే ఒక్క తెలుగు సినిమా చేసిన ఈమె మరెవరో కాదు.. వామికా గబ్బి. సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన 'భలే మంచి రోజు' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైంది. ఈ మూవీ కమర్షియల్‌గా ఫెయిల్ కావడంతో వామికా మళ్లీ తెలుగులో మరే చిత్రంలో నటించలేదు పంజాబీ, హిందీ, మలయాళం, తెలుగు సినిమాల్లో నటించింది వామికా గబ్బి. 2007లో 'జబ్ వి మెట్' సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చినా.. ఇప్పటివరకు ఈ బ్యూటీకి సరైన బ్రేక్ దక్కలేదు. 2023లో 'ఖుఫియా' అనే హిందీ సినిమాతో వామికా బాగా ఫేమస్ అయింది. ఈ చిత్రంలో ఆమె నటించిన బోల్డ్ సీన్స్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయ్యాయి. దాంతో ఈ బ్యూటీకి క్రేజ్ కూడా డబుల్ అయ్యింది. తాజాగా వరుణ్ ధావన్ హీరోగా వచ్చిన 'బేబీ జాన్' మూవీతో ప్రేక్షకులను పలకరించింది. ఇందులో వామికా.. టీచర్ పాత్రలో నటించి తన నటనకు గానూ మంచి మార్కులు తెచ్చుకుంది. ఇక అడివి శేష్ హీరోగా వస్తోన్న 'గూఢచారి -2' సినిమాతో మరోసారి తెలుగులో రీ-ఎంట్రీ ఇవ్వనుంది.




## అప్పటికీ.. ఇప్పటికీ శ్రీయది ఒకటే అందం

టాకీస్: టాలీవుడ్ సీనియర్ నటి శ్రీయా శరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఒకప్పుడు వరస సినిమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది ఈ చిన్నది. తెలుగు చిత్ర పరిశ్రమలో అందరి స్టార్ హీరోల సరసన నటించడమే కాకుండా లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్స్‌తో కూడా తన సత్తా చాటింది. ఇక చాలా కాలంగా ఈ బ్యూటీ అంతగా సినిమాలు చేయడం లేదు. ముఖ్యంగా కరోనా తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పి తన కూతురును చూసుకుంటూ ఉంది. ఈ మధ్య ఈ అమ్మడు పలు సినిమాల్లో స్పెషల్ పాత్రల్లో కనిపిస్తూ సందడి చేస్తుంది. ఇక సినిమాల్లో కంటే ఈ బ్యూటీ ఈ మధ్య సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. వరస ఫొటో షూట్స్‌తో కుర్రకారు మతిపోగొడుతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పింక్ కలర్ డ్రెస్‌లో సరికొత్త లుక్‌లో దర్శనం ఇచ్చింది. కుర్ర హీరోయిన్స్‌కు ఏ మాత్రం తీసిపోకుండా తన అందంతో మాయ చేస్తుంది ఈ చిన్నది.

## నేను వోడ్కాను తప్పితే.. దేనినీ ప్రమోట్ చేయను : రాంగోపాల్‌వర్మ



**టాకీస్:** ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వివాదం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యవహారంలో పలువురు తెలుగు సినీ సెలబ్రిటీలతో పాటు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. అయితే తాజాగా ఈ వివాదంపై ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందించాడు. రామ్ గోపాల్ వర్మ నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం శారీ. యథార్థ సంఘటనల ఆధారంగా వస్తున్న ఈ చిత్రంలో ఆరాధ్య దేవి కథానాయికగా నటిస్తుంది. వర్మ ఈ సినిమాకు కథను అందించగా.. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. ఆర్వీప్రొడక్షన్స్ పతాకంపై రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని ఏప్రిల్ 04న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ప్రమోషన్స్ నిర్వహించింది చిత్రయూనిట్. ఈ వేడుకలో ఆర్జీవీ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ గురించి మాట్లాడుతూ.. నేను బెట్టింగ్ యాప్స్ గురించి తెలియదు. ఎందుకంటే ఇంతకుమందు కూడా నేను ఎటువంటి యాడ్‌లలో నటించలేదు. అలాగే నా సోషల్ మీడియా అకౌంట్స్‌ని కూడా ప్రమోషన్‌కి వాడలేదు. ఒకవేళ నేను ప్రమోట్ చేయాలి అనుకుంటే వోడ్కానే ప్రమోట్ చేస్తా.. బెట్టింగ్ యాప్స్ కాదు. ఎందుకంటే కొన్ని ప్రమోట్ చేయాలంటే అవి లీగలా కాదా అనేది ఎవరికి తెలిసి ఉండదు. ప్రభుత్వం ఇవి లీగల్ అని ప్రజలకు అవగాహన కల్పించాలి. స్టార్ నటులను తీసుకుంటే బెట్టింగ్ యాప్స్ కాకుండా చాలా బ్రాండ్‌లను ప్రమోట్ చేస్తూ ఉంటారు. అవి లీగల్ అని ఎలా తెలుస్తది. సడన్‌గా ఒకరోజు వచ్చి అవి ప్రమోట్ చేయడం నేరం అంటారు. ఇలాంటివి చేసే ముందు ప్రభుత్వం అవేర్‌నెస్ క్రియేట్ చేయాలంటూ ఆర్జీవీ చెప్పుకోచ్చాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.